PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 42 సంచిక : 347 | విజయవాడ, సోమవారం 17 జులై 2023 | 6+8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Monday 17 July 2023 | Rs

ఇప్పటికీ గుడారాల్లోనే..
- 'పోలవరం' వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం
- 2022 వరదల ప్రభావం నుంచి నేటికీ తేరుకోని నిర్వాసితులు

లోపలి పేజీలో..



దులీప్ ట్రోఫీ విజేత సౌత్‌జోన్
- ఫైనల్లో వెస్ట్‌జోన్‌పై 75పరుగుల తేడాతో గెలుపు
- 14వ సారి టైటిల్ కైవసం

లోపలి పేజీలో..

చేనేతపై కేంద్రం దొంగ దెబ్బ

- పట్టు, నూలుపై జిఎస్‌టి తగ్గించేందుకు ససేమిరా
- అడిగిందే తడవుగా సూరత్ జరీపై తగ్గింపు


(ఫైల్)

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చేనేత రంగంపై కేంద్ర ప్రభుత్వం మరోసారి దొంగదెబ్బ కొట్టింది. వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) నుంచి చేనేత రంగానికి సంబంధించిన పట్టు, నూలు, రంగులను జిఎస్‌టి నుంచి మినహాయించి కార్మికులను ఆదుకోవాలని పదేపదే ఆందోళనలు చేస్తున్నా.. పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మేరకు విజ్ఞప్తులు చేస్తున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెడచెవిన పెడుతూవస్తోంది. చేనేతను ఇంత నిర్లక్ష్యం చేసిన మోడీ సర్కార్ ఇప్పుడు గుజరాత్ వ్యాపారులు అడిగిందే తడవుగా సూరత్ జరీపై జిఎస్‌టిని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించింది. ఈ మేరకు తాజా జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం చేశారు. దీంతో తెలుగు రాష్ట్రాల్లోని చేనేత కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

దేశంలో ఉత్పత్తి అవుతున్న 90 శాతం జరీ ఉత్పత్తులు సూరత్ పట్టణంలోనే తయారవుతున్నాయి. 2017లో జిఎస్‌టి పన్నుల విధానం అమలులోకి వచ్చినప్పుడు రియల్, ఇమిటేషన్ జరీలపై 12 శాతంగా జిఎస్‌టి వేయాలని నిర్ణయించారు. సూరత్‌కు చెందిన వ్యాపారులు, స్థానిక నాయకత్వం, గుజరాత్ ప్రజా ప్రతినిధులు రియల్ జరీ పన్నును 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించుకున్నారు. మళ్లీ ఇప్పుడు అదే సూరత్ వ్యాపారులు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఇమిటేషన్ జరీపై ఉన్న 12 శాతం జిఎస్‌టిని కూడా 5 శాతానికి తగ్గించుకున్నారు. మిల్లులపై ఉత్పత్తి చేసే బట్టలపై విధించే పన్నులు, చేనేత మగ్గంపై తయారు చేసే బట్టలపై విధిస్తున్న పన్నులు ఒకే స్లాబ్ కింద ఉండకూడదని దేశవ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులు మొదటి నుంచీ వాదిస్తూ వస్తున్నారు. పవర్‌లూమ్స్‌తో హ్యాండ్లూమ్ పోటీ పడలేదని తెలిసి కూడా కేంద్రం ఆ రెండింటినీ ఒకే గాటన కట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా తెలుగు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో చేనేత మగ్గాలపై వేసే వస్త్రాలకు పట్టు, నూలు, కొంత వరకూ జరీ వాడుతారు. పట్టుపై 19 శాతం, నూలుపై 5 శాతం, రంగులపై 5 శాతం జిఎస్‌టి కొనసాగుతోంది. పవర్‌లూమ్స్‌లోనూ ప్రస్తుతం నూలు, పట్టు వినియోగిస్తున్నారు. కానీ ఎక్కువ మోతాదులో ఫ్లోరా జరీ అనే దారాన్ని వినియోగిస్తున్నారు. ఇప్పుడు మోడీ సర్కార్ జరీపై జిఎస్‌టిని 7 శాతం మేర తగ్గించి నూలుతో సమానంగా 5 శాతానికి చేసింది. దీనిపైనే ఇప్పుడు చేనేత కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్లుగా పోరాడుతున్నా..

కేంద్రంలోని బిజెపి సర్కారు అధికారం చేపట్టిన నాటి నుంచి చేనేత రంగాన్ని నిర్వీర్యం చేస్తూవస్తోందని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2017 నుంచి 5 శాతం జిఎస్‌టిని చేనేతపై విధించింది. నాటి నుంచి జిఎస్‌టి తొలగించాలని చేనేత కార్మికులు, సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి నుంచి ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లక్షలాది మంది ఉత్తరాలు పంపించారు. చేనేత పై జిఎస్‌టి పన్ను తొలగించాలని దాదాపు 100 మంది పార్లమెంటు సభ్యులు సంతకాలు చేనేత మహా వస్త్ర లేఖపై సంతకాలు కూడా చేశారు. చేనేత రంగాన్ని జిఎస్‌టి నుంచి మినహాయింపు ఇవ్వాలని కొనసాగుతున్న ఉద్యమానికి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాలు, 15 రాజకీయా పార్టీలు మద్దతు ప్రకటించా యి. అయినప్పటికీ కేంద్ర సర్కారు మాత్రం చలించడం లేదు.

కార్పొరేట్ల కొమ్ముకాస్తున్న కేంద్రం

మోడీ సర్కార్ ఆది నుంచీ కార్పొరేట్ల కొమ్ముకాస్తున్నదని చేనేత కార్మిక సంఘాలు నేతలు విమర్శించారు. జిఎస్‌టిని తొలగించాలని ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా పట్టించుకోని కేంద్రం, కేవలం గుజరాత్ జరీ పరిశ్రమ రక్షణ కోసం మాత్రం జిఎస్‌టిని 7 శాతానికి తగ్గించిందని విమర్శిస్తున్నారు. కేంద్రం ఇప్పటికైనా వివక్ష పూరిత విధానాలు మార్చుకోవాలని, లేదంటే మూల్యం చెల్లించకతప్పదని కార్మికులు హెచ్చరిస్తున్నారు. చేనేతకు సంబంధించిన పట్టు, నూలు, రంగులపై జిఎస్‌టిని పూర్తిగా ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బిజెపి నేత కుమారుడి అఘాయిత్యం..
- యువతిపై సామూహిక లైంగికదాడి

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని దతియా జిల్లాలో ఇద్దరు అక్కాచెల్లెళ్లపై నలుగురు యువకులు సామూహిక లైంగికదాడికి తెగబడ్డారు. నిందితుల్లో బిజెపి ఆఫీస్ బేరర్ కుమారుడు (మైనర్) పేరు ఉండటంతో రాజకీయంగానూ ఇది తీవ్ర దుమారం రేపుతోంది. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బాధితుల బంధువులు, స్థానికులు పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. తమను కిడ్నాప్ చేసి, లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తన ఫిర్యాదులో పేర్కొన్నట్టు జిల్లా ఎస్‌పి ప్రదీప్ శర్మ తెలిపారు. ఇరువురు ఇంటికి చేరుకున్న తర్వాత.. బాధిత యువతి ఆత్మహత్యకు ప్రయత్నించిందని, ఆమె ఝాన్సీ ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని చెప్పారు. సామూహిక లైంగికదాడి, పోక్సోతోపాటు పలు సెక్షన్ల కింద కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఓ యువకుడితో పాటు ఇద్దరు మైనర్లను అరెస్టు చేశారని, నాలుగో వ్యక్తి ఆచూకీ చెప్పిన వారికి రూ.10వేల రివార్డును ప్రకటించామని చెప్పారు.

యడవల్లిలో మరోసారి దళితుల భూపోరాటం
- భూమికి భూమి లేదా చట్ట ప్రకారం పరిహారం ఇచ్చేంత వరకూ సాగు చేస్తామని

3

అసైన్డ్ భూములపై పునఃపరిశీలించాలి

ధర్మాన ప్రసాదరావు కమిటీ నివేదిక బహిరంగపరచాలి
ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అసైన్డ్ భూముల ముసాయిదా చట్టాన్ని పున:పరిశీలించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ చట్టంపై అభ్యంతరాలను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి ఆదివారం లేఖ ద్వారా తెలిపారు. చట్ట సవరణలో చేసిన మార్పులపై అభ్యంతరాలు స్వీకరించాలని కోరారు. ఈనెల 12వ తేదీన మంత్రివర్గ సమావేశం తర్వాత పేదలకు భూపంపిణీ చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. అదే సమయంలో అసైన్డ్ భూములపై యాజమాన్యపు హక్కు కల్పిస్తామని కూడా నిర్ణయించారని వివరించారు. ఈ నిర్ణయంవల్ల అసైన్డ్ భూములు పొందిన నిజమైన దళితులు, ఇతర పేదలకు నష్టం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో అత్యధిక భాగం అసైన్డ్ భూములు పేదల చేతులనుండి జారిపోయి ధనవంతులు, సంపన్నుల చేతుల్లోకి మారాయని పేర్కొన్నారు. ఈ భూములన్నింటినీ అసలు లబ్ధిదారులైన పేదలకు బదలాయించాలని కోరారు. అదే విధంగా పేదలకు పంచడానికి లక్షలాది ఎకరాలు ఉన్నట్లు గతంలో కోనేరు రంగారావు భూకమిటీ చెప్పిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో సుమారు ఐదు లక్షలమందికిపైగా దశాబ్దాలు తరబడి పేదలు ఇళ్లస్థలాలు వేసుకొని పట్టాలు లేకుండా జీవనం సాగిస్తున్నారని వివరించారు. ప్రభుత్వ భూముల్లోనూ ఇతర అనేక కాలనీల్లో దీర్ఘకాలంగా నివాసం ఉంటున్న పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని, దీనికోసం ప్రభుత్వం ఒక ప్రత్యేక కార్యక్రమం రూపొందించి అమలు చేయాలని కోరారు. 1954 నుంచి 2002 మధ్యకాలంలో అసైన్డ్ భూమి పొందిన సుమారు 15.21 లక్షల మందికి 27.41 లక్షల ఎకరాలకు యాజమాన్యపు హక్కులు కల్పిస్తూ మంత్రివర్గం తీర్మానం చేసిందని తెలిపారు. కానీ 1977కి ముందు దళితులు, ఇతర పేదలకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములు భూస్వాములు, పెత్తందార్లు, పలుకుబడి కల్గినవారు బినామీ పేర్లతోనూ, పేదలకు డబ్బు ఆశ చూపి, కొద్దో, గొప్పో అప్పులు ఇచ్చి, అదిగాక పోతే అదిరించి, బెదిరించి అసైన్డ్ భూములు పొందారని వివరించారు. ఈ కారణంగా దళితుల్లో భూమి లేకుండా పోవడం వల్లే దీనిని అరికట్టి దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూముల రక్షణ కోసం 9/77 చట్టం వచ్చిందని గుర్తుచేశారు. ఈ చట్టం అమల్లో ఉండగానే ఉమ్మడి రాష్ట్రంలో సుమారు 25 లక్షల ఎకరాలు దళితులకు చెందిన అసైన్డ్ భూమి అనర్హుల చేతుల్లోకి వెళ్లినట్లు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో నియమించిన కోనేరు రంగారావు భూ కమిటీ నివేదిక ఇచ్చిందని గుర్తుచేశారు. అందువల్ల ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయం పేదలకు తోడ్పడేది కాదని, పేదల నుండి భూములు పొందిన సంపన్నులకే ఈ యాజమాన్యపు హక్కులు పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని పున:పరిశీలించాలని కోరారు. ఈ సమస్యపై నియమించిన ధర్మాన ప్రసాదరావు కమిటీ నివేదికను బహిరంగపర్చి, అన్ని పక్షాల అభిప్రాయాలను తీసుకోవాలని కోరారు. ఈ నివేదిక ఆధారంగానే 2006 మార్చిలో జరిగిన అసెంబ్లీ సమావేశంలో "తెలిసో తెలియకో తన తండ్రి రాజారెడ్డి కూడా దళితుల చేతుల్లో ఉన్న 300 ఎకరాలు అసైన్డ్ భూములు పొందారని, వాటిని వెంటనే వెనక్కి మిగతా 2లో

అన్నిరకాల ఆర్థిక సర్వేలు, గణాంకాల సమీక్షకు
16 మందితో కొత్త కమిటీ



న్యూఢిల్లీ : వినిమయ వ్యయం, ఉపాధిపై 2019లో ఏర్పాటు చేసిన స్టాండింగ్ కమిటీ ఆన్ ఎకనామిక్స్ స్టాటిస్టిక్స్ (ఎస్‌సిఇఎస్) సమీక్షించిన గృహ సర్వేలు, సమాచారంపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో మొత్తం అధికారిక సమాచారాన్ని సమీక్షించడానికి 16 మంది సభ్యులతో కొత్త ప్యానెల్‌ను కేంద్రం ఏర్పాటు చేసింది. జాతీయ గణాంక కార్యాలయం నేతృత్వంలో చేసిన అన్ని సర్వేల ఫలితాలను, సమాచారాన్ని ఈ కొత్త ప్యానెల్ మరొకసారి సమీక్షిస్తుంది. ఎస్‌సిఇఎస్ కేవలం ఆర్థిక సమాచార సర్వేలపై మాత్రమే సమీక్షించగా, కొత్త ప్యానెల్ మాత్రం ఆర్థిక, సామాజిక అంశాలతో సహా మొత్తం సమాచారంపై సమీక్షలు చేస్తుంది. సర్వే ఫలితాలు, అంతరాలపై కేంద్ర ప్రభుత్వానికి సలహాలు ఇస్తుంది. భారత దేశపు మొట్టమొదటి ముఖ్య గణాంక శాస్త్రవేత్త, జాతీయ గణాంక కమిషన్ (ఎన్ఎస్‌సి) మాజీ చైర్మన్ ప్రణబ్ సేన్ ఈ ప్యానెల్‌కు అధ్యక్షులుగా ఉంటారు. ఈ ప్యానెల్ పది మంది అధికారిక సభ్యులు, మరో నలుగురు ప్రముఖ విద్యావేత్తలు అనధికార సభ్యులుగా ఉంటారు. కేంద్ర గణాంక మంత్రిత్వ శాఖ ఉత్తర్వుల ప్రకారం ఈ ప్యానెల్‌లో గరిష్టంగా 16 మంది వరకూ సభ్యులు ఉండవచ్చు. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యులు, ఛైర్‌పర్సన్ వివేక్ దేబ్రాయ్‌తో సహా అనేక మంది ప్రముఖులు ఎస్‌సిఇఎస్ సమాచారంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. సర్వేల రూపకల్పనల్లో భారత స్టాటిస్టికల్ సర్వీస్‌కు సరైన నైపుణ్యం లేదని విమర్శించారు. కాగా సర్వే ఫలితాలను ఖరారు చేయడంలో ఈ కొత్త ప్యానెల్ సహాయం చేస్తుంది. ముఖ్యంగా పారిశ్రామిక రంగం, సేవల రంగం, కార్మిక శక్తి గణాంకాలను ప్యానెల్ తప్పనిసరిగా సమీక్షిస్తుంది. అయితే ఈ ఫలితాల వెల్లడిని ఆమోదించే అంతిమ అధికారం ఎన్ఎస్‌సికి మాత్రమే ఉంటుంది. గత డిసెంబర్‌లో ఎన్ఎస్‌సిని కేంద్రం పునర్నిర్మించింది. దాని పార్ట్‌టైమ్ చైర్‌పర్సన్‌గా చెన్నై మ్యాథమెటికల్ ఇనిస్టూట్యూట్ ప్రొఫెసర్ రాజీవ లక్ష్మణ్ కరాండికర్, మరో ఇద్దరు పార్ట్‌టైమ సభ్యులను నియమిస్తూ మే30న నోటిపై చేశారు. ఎన్ఎస్‌సిలో ఇంకా రెండు ఖాళీలు ఉన్నాయి.

'ఢిల్లీ' ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తాం

- కేజ్రీవాల్‌కు కాంగ్రెస్ భరోసా
- ప్రతిపక్షాల భేటీకి హాజరవుతాం : ఆప్
- నేడు, రేపు బెంగళూరులో ప్రతిపక్షాల భేటీ

న్యూఢిల్లీ : బెంగళూరులో ప్రతిపక్ష పార్టీల సమావేశానికి రెండు రోజుల ముందు కీలక పరిణామం చోటు చేసుకుంది. ఢిల్లీ అధికారాలను హరించివేస్తూ కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తున్నట్లు కాంగ్రెస్ తన వైఖరిని స్పష్టం చేసింది. కాంగ్రెస్ ఈ ప్రకటన చేసిన కొద్ది గంటలకే ఆమాద్మీ పార్టీ నేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సోమ, మంగళవారాల్లో బెంగళూరులో జరిగే ప్రతిపక్షాల భేటీకి తాము హాజరవుతున్నామని చెప్పారు. కేంద్ర ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా పార్లమెంటులో ఓటు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇవ్వకపోతే తాము బెంగళూరు సమావేశానికి హాజరుకాబోమని కేజ్రీవాల్ అంతకుముందు హెచ్చరించారు. దీంతో కాంగ్రెస్ అంతర్గత కమిటీ సమావేశమై కేంద్ర ఆర్డినెన్స్‌పై కేజ్రీవాల్‌కు బాసటగా నిలవాలని నిర్ణయించింది. గవర్నర్ల వ్యవస్థను దుర్వినియోగం చేసి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల అధికారాల్లో జోక్యం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఏ చర్యకైనా తమ పార్టీ వ్యతిరేకమని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కెసి వేణుగోపాల్ చెప్పారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. పార్లమెంటులో ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లు ఎప్పుడు ప్రవేశపెట్టినా వ్యతిరేకించాలని పార్టీ నిర్ణయించినట్లు తెలిపారు. 'సమాఖ్య వ్యవస్థను దెబ్బతీసే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలన్నిటినీ నికరంగా వ్యతిరేకిస్తూనేవున్నాం. గవర్నర్ల ద్వారా రాష్ట్రాలను పాలించాలన్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూనేవున్నాం. మా వైఖరి చాలా స్పష్టం. ఢిల్లీ ఆర్డినెన్స్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ఇవ్వబోం' అని కెసి వేణుగోపాల్ చెప్పారు. ఆ వెంటనే ఆప్ ఎంపీ, జాతీయ అధికార ప్రతినిధి రాఘవ్ చద్దా దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ,కాంగ్రెస్ ప్రతిపక్షాల ఐక్య గళాన్ని వినిపించడం ఓ సానుకూల పరిణామం' అని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో బ్యూరోక్రాట్ల నియామకాలు, బదిలీల విషయంలో అంతిమ నిర్ణయం ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వానిదేనని సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుకు భిన్నంగా బ్యూరోక్రాట్లపై అధికారాన్ని లెఫ్టినెంట్ గవర్నరుకు కట్టబెడుతూ కేంద్రం ఒక దుర్మార్గమైన ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. పార్లమెంటులో దీనిపై బిల్లు పెడితే వ్యతిరేకించాలని కోరుతూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఇదివరకే ప్రతిపక్షాల నేతలను కలిసి విన్నవించిన సంగతి తెలిసిందే. ఈ విషయం లో కాంగ్రెస్ కూడా తన వైఖరేమిటో చెప్పాలని ఆప్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ తాను ఢిల్లీ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకమని స్పష్టం చేసింది.

బెంగళూరు సమావేశానికి సర్వం సిద్ధం

కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ బిజెపిని ఓడించడమే లక్ష్యంగా దేశంలోని ప్రతిపక్షాలన్నీ ఒక్కటొక్కటిగా జట్టు కడుతున్నాయి. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలో పాట్నాలో గత జూన్ 23న తొలిసారి సమావేశమైన ప్రతిపక్షాల పార్టీల నేతలు మలి విడతలో భాగంగా బెంగళూరులో రెండు రోజుల పాటు (సోమవారం, మంగళవారం) సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి మొత్తం 24 పార్టీలకు చెందిన అధినేతలు, ప్రతినిధులు హాజరయ్యే అవకాశముంది. బెంగళూరులోని తాజ్ వెస్ట్ ఎండ్ హోటల్ దీనికి వేదికగా నిలవనుంది. ఆదివారం రాత్రి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి రణదీప్ సూర్జేవాలా, రాష్ట్ర హోంమంత్రి పరమేశ్వరన్ అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. పాట్నాలో జరిగిన తొలి మిగతా 2లో

గ్రానైట్ క్వారీలో పేలిన కంప్రెషర్
- కార్మికుడు మృతి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం బొరిగిపేట సమీపంలోని సిహెచ్ గ్రానైట్ క్వారీలో ఆదివారం జరిగిన ప్రమాదంలో బీహార్ రాష్ట్రానికి చెందిన భూషణ్ దాస్ (53) మృతి చెందారు. అదే రాష్ట్రానికి చెందిన బోల కుమార్, దరపు సన్నీ, రోషన్ కుమార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. కంప్రెషర్ రబ్బరు ట్యూబ్ ఒక్కసారిగా పేలడంతో దాని నుంచి వచ్చిన గాలి తీవ్రతకు అక్కడ పనిచేస్తున్న వీరు ఐదుగురూ కిందకు తుళ్లిపడడంతో తీవ్రంగా గాయపడ్డారు. టెక్కలి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ దాస్ మృతి చెందారు. మిగతా నలుగురూ శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ ఎల్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు.

ప్రాజెక్టుల నిర్వహణ లోపభూయిష్టం

నిధుల కొరతే ప్రధాన కారణం అంటున్న నిపుణులు


పులిచింతల ప్రాజెక్టు 16వ గేటు కొట్టుకుపోవడంతో దిగువకు వెళ్తున్న వరద నీరు (ఫైల్)

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సాగునీటికి, తాగునీటికి కీలకమైన ప్రాజెక్టుల భద్రతను రాష్ట్రప్రభుత్వం విస్మరిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించిన నిధులు ఇవ్వడంలో జరుగుతున్న జాప్యంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. దీంతో కీలకమైన ప్రాజెక్టుల భద్రతపై ప్రతికూల ప్రభావం పడుతోంది. 2019లో ప్రకాశం బ్యారేజితో మొదలు పులిచింతల, అన్నమయ్య, గుండ్లకమ్మ, పోతిరెడ్డిపాడు... ఇలా ఏదో ఒక ప్రాజెక్టు నిర్వహణా లోపంతో దెబ్బతింటోంది. కేవలం నిర్వహణకు సంబంధించిన నిధులు ఇవ్వకపోవడంతో 2020 సెప్టెంబర్‌లో గేటుకు గ్రీస్ పూయలేక పులిచింతల ప్రాజెక్టులోని 16వ గేట్ హైడ్రాలిక్ సిస్టం దెబ్బతిని గేటు కొట్టుకు పోయింది. దీంతో ప్రాజెక్టును స్పిల్‌వే వరకు నీటిని ఖాళీ చేయాల్సి వచ్చింది. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఈ ఘటనతో ప్రాజెక్టుల నిర్వహణకు నిధులు కేటాయించడంతో పాటు పర్యవేక్షణ పెరుగుతుందని ఆశించిన రైతాంగానికి 2021లో అన్నమయ్య ప్రాజెక్టు ధ్వంసం, ఆ తర్వాత గుండ్లకమ్మ ప్రాజెక్టు దెబ్బతిన్న గేట్ల వ్యవహారంతోపాటు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ 10వ గేట్ దెబ్బతినడం లాంటి అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు కింద ప్లంజ్‌పూల్ పూర్తిగా దెబ్బతింది. శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతుల పనులు చేయాలని కేంద్ర ప్రాజెక్టుల భద్రతా కమిటీ ఛైర్మన్ పాండ్యా నివేదికలను బుట్టదాఖలు చేశారు. చారిత్రాత్మకమైన ధవళేశ్వరం ప్రాజెక్టు కూడా నిధులు లేక నీరసించి పోతోంది. ధవళేశ్వరం ప్రాజెక్టుకు వున్న 175 గేట్ల మరమ్మతు పనులను 2018లో చేపట్టారు. మరమ్మతుల పనులకు ప్రభుత్వం నిధులను ఇవ్వడం లేదని 53 గేట్లకు మరమ్మతులు చేసి వదిలేశారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌దీ అదే పరిస్థితి. ప్రకాశం జిల్లాలో 80వేల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించే లక్ష్యంతో 3.87 టిఎంసిల సామర్థ్యంతో గుండ్లకమ్మ నదిపై చేపట్టిన కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్ల నిర్వహణ కోసం రూ.3 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం అందుకు తగ్గ నిధులను ఇవ్వకపోవడంతో మూడవ గేట్ ధ్వంసమైంది. దీంతో ప్రాజెక్టులోని నీరంతా సముద్రం పాలై ఖరీఫ్‌కు సాగుకు నీరివ్వలేని పరిస్థితి నెలకొంది. అన్నమయ్య ప్రాజెక్టు కూడా నిర్వహణా లోపంతోనే పూర్తిగా కొట్టుకుపోయింది. ఎగువన కురిసే వర్షాలకు ఎంతనీరు ప్రాజెక్టులోకి వస్తుంది.. దిగువకు ఎంత నీరు వదలాలి అనే నిర్వహణా యంత్రాంగం సరిగాలేక ప్రాజెక్టు కొట్టుకుపోయింది.

రాష్ట్రంలో అన్నమయ్య ప్రాజెక్టు ఘటన తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఇరిగేషన్ ఇఎన్‌సి, ఐఐటి, జెఎన్‌టియు లాంటి ప్రతిష్టాత్మక సంస్థలకు చెందిన నిపుణులతో ప్రాజెక్టుల భద్రత కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన హైలెవల్ కమిటీ నిర్ణయాలు ఏమ య్యాయని రైతులు ప్రశ్నిస్తున్న పరిస్థితి. ఇప్పటికైనా ప్రాజెక్టుల నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించిసాగునీటిని అందించాలని కోరుతున్నారు.



పవన్‌తో పంచకర్ల భేటీ
- 20న జనసేనలో చేరిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్‌ను విశాఖజిల్లా వైసిపి మాజీ అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు మంగళగిరి జనసేన రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆదివారం కలిశారు. ఈనెల 20న మంగళగిరిలో తన అనుచరులతో కలిసి పార్టీలో చేరనున్నట్లు పంచకర్ల ప్రకటించారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌ను కలిసిన అనంతరం పంచకర్ల రమేష్‌బాబు మీడియాతో మాట్లాడారు. జనసేన పార్టీ భావజాలం, రాష్ట్ర శ్రేయస్సుకోసం పవన్‌కల్యాణ్ పడుతున్న తపన చూసి జనసేన పార్టీ కోసం ఒక సైనికునిలా పనిచేయాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. పవన్‌కల్యాణ్ ఎలాంటి బాధ్యతలు అప్పగించినా నూటికి నూరుపాళ్లు న్యాయం చేస్తానని పేర్కొన్నారు. తాజా రాజకీయ పరిణామాలను నాదెండ్ల మనోహర్‌తో చర్చించారు.




జార్జియా కాల్పుల ఘటన నిందితుడి చిత్రాన్ని విడుదల చేస్తున్న పోలీసులు

అమెరికాలో ఆగని కాల్పుల మోత

జార్జియాలో నలుగురి మృతి

వాషింగ్టన్ : అమెరికాలో తుపాకీ సంస్కృతి మళ్లీ బుసలు కొడుతున్నది. సామూహిక హత్యలు పెరిగిపోతున్నాయి. ఈ నెల4న ఒకే రోజు 10 మందిని కాల్చి చంపి, దాదాపు 40 మందిని గాయపరిచిన మూడు కాల్పుల ఘటనల నుంచి అమెరికా తేరుకోక ముందే జార్జియాలో తాజాగా మరో దారుణం చోటుచేసుకుంది. శనివారం పట్టపగలు ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో నలుగురు మృతి చెందారు. జార్జియా రాష్ట్ర రాజధాని అట్లాంటాకు 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న హంప్టన్ పట్టణంలోని డాగ్‌వుడ్ లేక్స్ ఏరియాలో ఉదయం 10:45 గంటల సమయంలో కాల్పులు జరిగాయని స్థానిక పోలీసులు తెలిపారు. మృతుల్లో ఒక మహిళ, ముగ్గురు పురుషులు ఉన్నారు. కాల్పుల జరిపిన దుండగున్ని స్థానిక ప్రాంతానికే చెందిన 41 ఏళ్ల ఆండ్రీ లాంగ్‌మోర్‌గా గుర్తించారు. అతడి కోసం గాలిస్తున్నారు. మానవ హక్కుల గురించి ప్రపంచానికి పాఠాలు చెప్పే అమెరికాలో సామూహిక హత్యలు నిత్యకృత్యంగా మారిపోయాయి. ఈ ఏడాది మొదటి ఆరు మాసాల్లో 382 వరకు సామూహిక కాల్పులు జరిగాయి. 140 మందికిపైగా మరణించారు. కాల్పులు జరిపిన వ్యక్తి కాకుండా కనీసం నలుగురు మృతి చెందితే దానిని సామూహిక కాల్పులుగా పేర్కొంటారు.



ఆరుద్రకు రక్షణ కల్పించాలి

- డిజిపికి చంద్రబాబు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిడ్డ వైద్యం నిమిత్తం సొంత ఆస్తి అమ్ముకునే విషయంలో కొంతకాలంగా పోరాటం చేస్తున్న కాకినాడ జిల్లాకు చెందిన ఆరుద్రకు రక్షణ కల్పించాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కోరారు. ఈ మేరకు డిజిపికి ఆదివారం లేఖ రాశారు. ఆరుద్ర కుమార్తె సాయి లక్ష్మి చందన వెన్నెముక సమస్య కారణంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుందని తెలిపారు. వైద్యం కోసం శంకవరం మండలం అన్నవరం గ్రామంలో ఉన్న తన ఇంటిని రూ.40 లక్షలకు విక్రయించాలని ఆరుద్ర చూశారని వివరించారు. మంత్రి దాడిశెట్టి రాజా వద్ద గన్‌మేన్‌గా పనిచేస్తున్న కానిస్టేబుళ్లు శివ, కన్నయ్య ఆమెను బెదిరించి రూ.10 లక్షలకే అమ్మాలని ఒత్తిడి తెచ్చారని తెలిపారు.వేధింపులపై ప్రభుత్వ స్పందన కార్యక్రమంతోపాటు అనేకచోట్ల ఫిర్యాదు చేసినా ఫలితం లభించలేదని పేర్కొన్నారు. ఆమెను వేధించిన వారిపై విచారణ జరిపి శిక్షపడేలా చేయాలని, బిడ్డకు తగిన వైద్యం అందించాలని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ఆందోళనకరంగా శాంతి భద్రతలు

దగ్గుబాటి పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో శాంతి భద్రతలు ఆందోళన కరంగా ఉన్నాయని, నేరాల నియంత్రణకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో అర్థం కావడం లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పదాతికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బూత్ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలని అన్నారు. వైసిపి నేతలు మద్యం, మైనింగ్ మాఫియాతో కోట్లు దోచుకున్నారన్నారు. సిఎం నివాసానికి సమీపంలో దళిత మహిళపై అత్యాచారం జరిగితే నిందితులను ఈ ప్రభుత్వం పట్టుకోలేదన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు కూలిపోవడానికి కారణం ఇసుక మాఫియానే అని ఆమె అన్నారు. సర్పంచ్‌లు పార్టీలకతీతంగా దారిమళ్లిన నిధుల కోసం ఆందోళనలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైం దని పురందేశ్వరి అన్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మీడియాకు వివరించారు. పదాతికారుల సమావేశంలో జాతీయ సహ సంఘటన ప్రధాన కార్యదర్శి శివప్రకాష్, కేంద్రమంత్రి మురళీధరన్, సునీల్‌దేవదర్, మాజీ సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు పాల్గొన్నారు.

'ఢిల్లీ' ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని ఓడించి తీరాలని ప్రతిపక్షాల నేతలు తీర్మానించిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని ఓడించేందుకు ఎత్తుగడలపై ప్రధానంగా ఈ సమావేశంలో చర్చించనున్నారు. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, మాజీ అధినేత్రి సోనియా గాంధీ, సీనియర్ నేత రాహుల్ గాంధీ ఈ సమావేశాలకు హాజరుకానున్నారు. ప్రతిపక్షాల పార్టీల నాయకుల కోసం సోమవారం రాత్రి విందు ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరవుతున్నట్టు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ,శివసేన (యుబిటి) నాయకులు ఉద్ధవ్ థాకరే, సంజయ్ రౌత్, ఆదిత్య థాకరే, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సిపిఎం నేత సీతారాం ఏచూరి, సిపిఐ నేత డి రాజా, అలాగే డిఎంకె, సమాజ్‌వాదీ పార్టీ, ఎన్‌సిపితో పాటు మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కఝగం (ఎండిఎంకె), కొంగు దశ మక్కల్ కచ్చి (కెడిఎంకె), విడుథలై చిరుథైగల్ కచ్చి (విసికె), రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్‌పి), ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్), కేరళ కాంగ్రెస్ (జోసెఫ్), కేరళ కాంగ్రెస్ (మణి) తదితర పక్షాల నేతలు హాజరుకానున్నారు.

నిధులు ఏమైనట్లు?

- వచ్చింది రూ.5,930 కోట్లు
- కేటాయించింది రూ.7,186 కోట్లు
- రెండేళ్లలో ఇచ్చింది రూ.379 కోట్లే



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పంచాయతీల నిధుల విషయంలో ఇప్పటికీ స్పష్టత కరువైంది. రాష్ట్రం నుంచి గత రెండేళ్లలో పంచాయతీలకు రూ.379 కోట్లు మాత్రమే వచ్చాయని సర్పంచులు చెబుతున్నారు. ఈ ఏడాది రూ.336 కోట్లకు ప్రొడీసింగ్స్ ఇచ్చినా ఇప్పటివరకు జమకాలేదు. దీనిపై సర్పంచులు ఆగ్రహంతో ఉన్నారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతున్నారు. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొత్తం రూ.7186 కోట్లు నిధులు కేటాయించారు. వాటిల్లో రూ.5930 కోట్లు విడుదల చేశారు. కానీ పంచాయతీలకు ఆ నిధులు జమకాలేదు. ఖాతాల్లో వేసినట్లే వేసి వెనక్కు తీసుకున్నారు. పంచాయతీ తీర్మానం లేకుండా సర్పంచుల సంతకం లేకుండా నిధులు వెనక్కు తీసుకోవడం సరికాదు. అలా చేయడం సైబర్ నేరం కిందకు వస్తుందని న్యాయవాదులు చెబుతున్నారు. గత రెండేళ్లలో కేవలం రూ.379 కోట్లే పంచాయతీలకు ఇచ్చారు. ఈ ఏడాది రూ.336 కోట్లకు ప్రొడీసింగ్స్ ఇచ్చినా ఇంతవరకూ వారి ఖాతాల్లో జమ కాలేదు. వాస్తవంగా కేంద్రం నుంచి రాష్ట్రానికి 14వ ఆర్థిక సంఘం కింద కేటాయింపులు, విడుదలను పరిశీలిస్తే 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.2622.13 కోట్లు కేటాయించి రూ.2336.56 కోట్లు విడుదల చేశారు. 2020-21 సంవత్సరంలో రూ.2625 కోట్లు కేటాయించి రూ.2,625 కోట్లు ఇచ్చారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.1939 కోట్లు కేటాయించి రూ.969 కోట్లు విడుదల చేశారు. అంటే మొత్తంగా రూ.5930 కోట్లు ఇచ్చేశారు.

నిధుల కోసమే గత ఎన్నికలు

వాస్తవంగా పంచాయతీరాజ్‌కు సంబంధించి ఎన్నికలు నిర్వహించకపోతే చట్ట ప్రకారం రావాల్సిన నిధులు విడుదల చేయదనే పేరుతో వైసిపి ప్రభుత్వం అప్పటికప్పుడు ఏర్పాట్లు చేసి పంచాయతీ ఎన్నికలకు సిద్ధమైంది. కోర్టు కేసులు రావడంతో కేంద్ర నిధులు రావని, అభివృద్ధి కుంటుపడుతుందని, అందువల్లే ఎన్నికల నిర్వహణ అత్యవసరమని ప్రభుత్వం తరుపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. స్థానిక పాలక మండళ్ల ఏర్పాటు ద్వారానే సుస్థిర పాలన సాధ్యమవుతుందనీ వక్కాణించారు. ఇప్పుడు నిధుల కేటాయింపుపై మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఒకవైపు ఇచ్చినట్లే ఇచ్చి విద్యుత్ బకాయిలకు జమేసుకున్నామని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ప్రకటించారు. అయితే జమకు సంబంధించిన రశీదులు ఇంతవరకు పంచాయతీలకు అందలేదు. పైగా బకాయిలకు వడ్డీలు, చక్రవడ్డీలు వేసి బిల్లులు ఇస్తున్నారు. దీనిపై సర్పంచులూ ఆగ్రహంతో ఉన్నారు. విద్యుత్ బకాయిలు జమేసుకుంటే బకాయిలు కట్టాలని విద్యుత్ శాఖ ఎందుకు బిల్లులు ఇస్తుందని ప్రశ్నిస్తున్నారు. గుంటూరు జిల్లాలో పలు పంచాయతీల సర్పంచులు ఇటీవల విద్యుత్‌శాఖ అధికారులను కలిశారు. పంచాయతీరాజ్‌శాఖ బిల్లులు కట్టామని చెబుతోందని, ఇంకా బకాయి ఏమిటని ప్రశ్నించగా తమకు జమైనట్లు ఇంతవరకు ఎటువంటి ఆధారమూ లేదని విద్యుత్‌శాఖ అధికారులు సమాధానం ఇచ్చారని, సర్పంచుల సంఘం నాయకులు పాపారావు తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి పంచాయతీల కోసం ఇచ్చిన నిధులు ఏమయ్యాయనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నిధుల కోసం ఎన్నికల నిర్వహిస్తున్నా మని చెప్పిన ప్రభుత్వం ఆచరణలో నిధులను పంచాయతీ లకు జమచేయకపోవడం విశేషం.

ఓటర్ల జాబితా పట్ల అప్రమత్తంగా వుండాలి: సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలో 2024లో జరిగే సాధారణ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్లీన్‌స్వీప్ చేసే రాజకీయ వాతావరణం కనిపిస్తోందని, ఓటర్ల జాబితాలో ఎక్కడా అవకతవకలకు అవకాశం ఇవ్వకుండా పార్టీ యంత్రాంగం యావత్తు అప్రమత్తంగా వుండాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం తాడేపల్లి నుంచి రాష్ట్రంలో వైసిపి పరిశీలకులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వైసిపి కేంద్ర కార్యాలయ పర్యవేక్షకులు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సజ్జల మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పట్ల ఇటీవల కాలంలో ప్రజల్లో సానుకూలత మరింత పెరిగిందన్నారు. రాష్ట్రంలో 175 స్థానాలను వైసిపి గెలుచుకునే పరిస్థితులు వున్నందున విపక్షాలు దుష్ప్రచారాన్ని ముమ్మరం చేశాయని తెలిపారు. దొంగఓట్ల తొలగింపు, అర్హులైన వారిని ఓటర్లుగా చేర్చే విషయంలో పార్టీ యంత్రాంగం చురుగ్గా వ్యవహరించాలని ఆదేశించారు. అసైన్డ్ భూములు, చుక్కల భూముల విషయంలో ప్రభుత్వం తీసుకున్న మేలును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. వలంటీర్లను డీఫేమ్ చేయాలని, టెర్రరైజ్ చేయాలని ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని, వాటి విద్వేష, విషపూరిత ప్రచారాన్ని తిప్పికొట్టాలని అన్నారు.

మోడీ దుష్పరిపాలన నుంచి రైతులను కాపాడాలని

30న విజయవాడలో రైతు సంఘాల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రధాని మోడీ దుష్పరిపాలన నుంచి రైతులు, శ్రామికులను కాపాడాలని కోరుతూ ఈనెల 30న విజయవాడ పిబి సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పేర్కొన్నారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. సదస్సుకు ఆలిండియా కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షులు, సీనియర్ పార్లమెంటేరియన్ హన్నన్‌మొల్లా, ఆలిండియా కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజన్, రాజరామ్‌సింగ్, అఖిల భారత వ్యవసాయ కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, ఆలిండియా కిసాన్ సభ నాయకులు అశోక్ కాయల్, సామాజిక వేత్త మేధాపాట్కర్ తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్మికులు, శ్రామికులు, రైతుల సమస్యలపై చర్చిస్తామని చెప్పారు. ఆగస్టు 9న క్విట్ కార్పొరేట్ పేరుతో ట్రేడ్ యూనియన్లు విజయవాడలో చేపట్టనున్న ధర్నాకు తమ మద్దతు ఉంటుందన్నారు. మోడీ ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలు, రాష్ట్రాల హక్కులను హరించడం, ఫెడరల్ స్ఫూర్తికి భంగం కలిగించడం లాంటి విధానాల నుంచి స్వాతంత్య్రం కావాలని, దేశాన్ని రక్షించాలని కోరుతూ ఆగస్టు 15న కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు వడ్డే శోభనాద్రీశ్వరరావు తెలిపారు. మీడియా సమావేశంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, సీనియర్ నాయకులు వై. కేశవరావు, ఎపి రైతు సంఘం (దాసరి భవన్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్, ఆళ్ల గోపాలకృష్ణ, కుర్రా నరేంద్ర, జెట్టి గురునాథరావు, ఎం.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి స్కీమ్ వెనుక స్కామ్

- 'యువగళం' దెబ్బకు వైసిపి ప్యాకప్ ఖాయం : లోకేష్

ప్రజాశక్తి - లింగసముద్రం (బాపట్ల)/ ఒంగోలు బ్యూరో

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రతి స్కీమ్ వెనుక స్కామ్ ఉందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆరోపించారు. యువగళం దెబ్బకు వైసిపి ప్యాకప్ చేయడం ఖాయమని అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 156వ రోజుకు చేరింది. ఆదివారం నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలం వెంగళాపురం నుంచి ప్రారంభమైన యాత్ర వలేటివారిపాలెం వరకు సాగింది. అక్కడ జరిగిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ.. జగన్మోహన్‌రెడ్డి వలంటీర్లను పెట్టి ప్రజల వ్యక్తిగత సమాచారం తీసుకుంటున్నారని, డేడా దొంగ జగన్ అని ఆరోపించారు. వ్యక్తిగత సమాచారం ఇస్తే మీకు ఉన్న ఆస్తులను కొట్టేయడం ఖాయమని విమర్శించారు. చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టించి 72 శాతం పూర్తి చేస్తే, జగన్ కమీషన్లకు కక్కుర్తితో రివర్స్ టెండరింగ్‌కు వెళ్లి ప్రాజెక్టును ప్రమాదంలో పడేశాడని విమర్శించారు. తన సొంత ప్రయోజనాల కోసం ఢిల్లీ చుట్టూ తిరుగుతూ కేసుల నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారేగానీ రాష్ట్ర ప్రయోజనాలు పట్టించుకోవడంలేదని దుయ్యబట్టారు. జగన్ ఇప్పటి వరకు విద్యుత్ ఛార్జీలు తొమ్మిదిసార్లు పెంచారని.. ఆర్‌టిసి ఛార్జీలు మూడుసార్లు పెంచారన్నారు. ఇంటి పన్ను, చెత్త పన్ను, నిత్యావసర సరుకులు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటాయని తెలిపారు. బిసిలకు, మైనార్టీలకు, దళితులకు టిడిపి ప్రభుత్వం తీసుకొచ్చి అనే పథకాలను వైసిపి ప్రభుత్వం తొలడించిందని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వీటిని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. కందురూరును ప్రకాశం జిల్లాలో కలుపుతామని, పేపర్ పరిశ్రమ తీసుకొచ్చి ఈ ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కందుకూరును మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతామని, మామిడి, సపోట రైతులకు మార్కెటింగ్ అవకాశంపాటు గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్ర ఆదివారం రాత్రి ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలోకి ప్రవేశించింది. పొన్నలూరు మండలం మాలపాడు వద్ద జిల్లా నేతలు ఆయనకు ఘనస్వాగతం పలికారు.



వలేటివారిపాలెం బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

పోర్టు కార్మికుల శ్రమ దోపిడీ

- కనీస కూలి దక్కక ఆర్థిక ఇబ్బందులు
- కానరాని భద్రతా సౌకర్యాలు
- ప్రమాదపుటంచుల్లో పనుల నిర్వహణ


ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

కాకినాడ సీ పోర్టు ప్రయివేట్ లిమిటెడ్ (కెఎస్‌పిఎల్), యాంకరేజ్ పోర్టుల్లో పనిచేస్తున్న వివిధ రకాల కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. వారికి కనీస కూలి దక్కడం లేదు. దీంతో, తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎగుమతి, దిగుమతి కూలీలతోపాటు సర్వేయర్ అండ్ టాలీ, బాలబంధు (బస్తాలు కుట్టేవారు), స్వీపర్లు, బార్జీలకు పెయింటింగ్, ఫిట్టింగ్ పనులు చేసే ఫ్యాబ్రికేటర్లు ఇలా సుమారు 20 వేల మంది కార్మికులు కాకినాడ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చి పనిచేస్తున్నారు. రోజుకు 10 నుంచి 12 గంటల పాటు పనిచేస్తున్నా కష్టానికి తగ్గ ఫలితం ఉండడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వే అండ్ టాలీ వర్కర్లు సుమారు రెండు వేల మంది పని చేస్తున్నారు. సరుకు సక్రమంగా వచ్చిందా? లేదా? అనేది సరిచూడడంతోపాటు ఎంత సరుకు వచ్చిందనేది వీరు లెక్కిస్తుంటారు. వీరంతా మధ్యవర్తి ద్వారా పనులకు వెళుతున్నారు. 10 నుంచి 12 గంటలు కష్టపడితే రోజుకు రూ.300 మాత్రమే వీరికి కూలి ఇస్తున్నారు. ప్రతి కార్మికుని వద్ద మధ్యవర్తి రూ.50 కమీషన్‌గా తీసుకోగా మిగిలిన రూ.250 మాత్రమే కార్మికులకు దక్కుతోంది. ఎగుమతి, దిగుమతుల్లో పనిచేస్తున్న హమాలీలు సుమారు పది వేల మంది ఉన్నారు. వీళ్లకు పీస్ రేటు ప్రకారం ఒక్కో బస్తాకు రూ.4 మాత్రమే ఇస్తున్నారు. 10 గంటల నుంచి 12 గంటలపాటు పని చేస్తే 100 నుంచి 130 బస్తాలు మాత్రమే ఎగుమతి, దిగుమతి చేయగలుగుతున్నారు. రూ.400 నుంచి రూ.520 మాత్రమే కూలి దక్కుతోంది. పని చేయించుకుంటున్న కాంట్రాక్టు సంస్థలు కూలీలకు కనీస వేతనాలను ఇవ్వట్లేదు. మధ్యవర్తుల ద్వారా పనుల్లో పెట్టుకుంటున్నందున కాంట్రాక్ట్ సంస్థలు ఎటువంటి కనీస సదుపాయాలూ కల్పించడం లేదు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా బయటకు పొక్కనీయకుండా తొక్కిపెడుతున్నాయి. కనీసం ఆస్పత్రికి తీసుకువెళ్లి పూర్తి స్థాయిలో వైద్యం కూడా చేయించట్లేదని పలువురు కార్మికులు వాపోతున్నారు. సీపోర్టు ద్వారా జనరల్ సరుకులు, రైస్, మొక్కజొన్న, షుగర్, ఫెర్టిలైజర్స్, బొగ్గు, ఐరన్, సుద్ధరాయి, బాక్సైట్, గ్రానైట్ రాళ్లు, క్రూడ్ ఆయిల్ దిగుమతులు జరుగుతున్నాయి. దుమ్ము, ధూళిలో కార్మికులు పనిచేయాల్సి వస్తోంది. దీంతో, పలువురు శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో సతమతమవుతున్నారు. శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మికులకు ప్రభుత్వం నుంచి సౌకర్యాలు అందేలా, భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాల్సిన కార్మిక, పరిశ్రమ శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పిఎఫ్, ఇఎస్ఐ వంటివి అమలు కావడం లేదు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను దృష్టిలో ఉంచుకుని కూలి రేట్లు పెంచాలని, చట్టబద్ధంగా కల్పించాల్సినవన్నీ అమలు చేయాలనికార్మికులు కోరుతున్నారు..



పోర్టులో పని చేస్తున్న కార్మికులు

కనీస కూలి రేట్లు పెంచాలి



నేను 25 ఏళ్లుగా పోర్టులో పనిచేస్తున్నాను. పొద్దస్తమానూ కష్టపడితే రూ.250 మాత్రమే వస్తోంది. కాంట్రాక్ట్ సంస్థలు, పోర్టు యాజమాన్యం స్పందించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలి.

- పి.కుమారస్వామి, సర్వే అండ్ టాలీ కార్మికుడు

పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు లేవు



ప్రమాదకర చోట్ల పనిచేసే కార్మికులకు కనీస భద్రత కరువైంది. ఇక్కడ పనిచేస్తున్న కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ అమలవ్వట్లేదు. ప్రమాదాల సందర్భంలో సరైన నష్టపరిహారం చెల్లించడం లేదు. పోర్టు లోపల ఆస్పత్రి సౌకర్యం లేకపోవడంతో ఏదైనా ప్రమాదం జరిగితే ఐదు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది.

- టి. వీర వెంకటరమణ, ఎగుమతి, దిగుమతి జట్టు యూనియన్ అధ్యక్షుడు, కాకినాడ పోర్టు



విదేశీ పక్షుల సందడి

గుంటూరు : దేశంలో పేరెన్నిక గన్న ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో విదేశీ పక్షులు సందడి చేస్తున్నాయి. ఆగస్టు దగ్గర పడుతుండటంతో పదుల సంఖ్యలో కొత్త పక్షులు వచ్చి చేరుకుంటుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

ప్రభుత్వ రంగ సంస్థలతోనే రిజర్వేషన్ల అమలు

స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ప్రభుత్వ రంగ సంస్థలతోనే రిజర్వేషన్ల అమలు సాధ్యమని స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొండా తౌడన్న, బయ్యే మల్లయ్య అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 885వ రోజుకు చేరాయి. దీక్షల్లో పోరాట కమిటీ నేతలు, ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ఉండడం వల్లే కార్మిక హక్కులు అమలవుతున్నాయని తెలిపారు. రిజర్వేషన్లు అమలు కావాలన్నా, యువతకు ఉద్యోగావకాశాలు మెరుగుపడాలన్నా ప్రభుత్వ రంగ సంస్థలు కీలకమని అన్నారు. త్యాగాలతో ఏర్పడి ఉత్తరాంధ్రలో వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు పన్నడం దారుణమన్నారు. ఐక్య పోరాటాలతో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుంటామని స్పష్టం చేశారు. దీక్షల్లో కాంగ్రెస్ నాయకులు వేగి వెంకటేష్, గొంపా గోవింద్, ఎల్.రామారావు, పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, కన్వీనర్ కెఎస్ఎన్.రావు, నాయకులు బొడ్డు పైడిరాజు, ఎన్.రామారావు, ఎస్.సత్యనారాయణ, పరంధామయ్య, పుల్లారావు, లక్ష్మణ మూర్తి, ఫణీంద్రబాబు పాల్గొన్నారు.

ఖరారు కాని ఇంజనీరింగ్ ఫీజులు

- ప్రభుత్వం వద్దే ఫైల్ పెండింగ్
- కౌన్సిలింగ్ కోసం విద్యార్థుల ఎదురుచూపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశాల ఫలితాలు నెల క్రితం విడుదలయ్యాయి. ఇప్పటి వరకు ఈ కోర్సులకు ఫీజులను ప్రభుత్వం ఖరారు చేయకపోవడంతో అడ్మిషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. ఫీజులకు సంబంధించిన ఫైల్‌ను ఎపి ఉన్నత విద్య పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్ రాష్ట్రప్రభుత్వానికి నెల రోజుల క్రితం పంపినా, ఇప్పటివరకు నిర్ణయం తీసుకోలేదు. మరో పక్క రాష్ట్రంలో 1,59,024 ఇంజనీరింగ్ సీట్లకు అఖిల భారత సాంకేతిక విద్య మండలి (ఎఐసిటిఇ) అనుమతి ఇచ్చింది. కనీసం అడ్మిషన్ల కౌన్సిలింగ్ షెడ్యూల్ కూడా విడుదల కాకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రాష్ట్రప్రభుత్వ తీరుపై అసంతృప్తిగా ఉన్నారు. మేలో నిర్వహించిన ఇఎపి సెట్ ఫలితాలను ఉన్నత విద్యామండలి జూన్ 14న విడుదల చేసింది. ఈ పరీక్షలో 1,71,514 మంది విద్యార్థులు ఇంజనీరింగ్ విభాగంలో అర్హత సాధించారు. అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల కాకపోవడంతో విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్తున్న పరిస్థితి నెలకొంది.

టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు కాన్పూర్, మద్రాస్, ముంబయి ఐఐటిలలో సీట్లు పొందారు. ఇఎపిసెట్ ఇంజనీరింగ్ విభాగంలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థి ఉమేష్ వరుణ్ ఐఐటి కాన్పూర్‌లో సీటు పొందారు. మూడో ర్యాంకు సాధించిన సాయిదుర్గారెడ్డి ముంబయి ఐఐటిలో, 7వ ర్యాంకు సాధించిన మనీంద్రరెడ్డి ముంబయి ఐఐటిలో, 105వ ర్యాంకు సాధించిన మురళీకృష్ణ మద్రాస్ ఐఐటిలో సీట్లు పొందారు. మరో పక్క తెలంగాణలో తొలిదశ ఇంజనీరింగ్ అడ్మిషన్ల కౌన్సిలింగ్ కూడా ఆదివారంతో ముగిసింది. తెలంగాణలో కన్వీనర్ కోటాలో 82,666 సీట్లకు 70,665 సీట్లు భర్తీ అయ్యాయి. రాష్ట్రానికి చెందిన విద్యార్థులు కూడా అక్కడ సీట్లు పొందారు. తెలంగాణలో మంచి కళాశాలలో సీటు రాకపోతే రాష్ట్రంలో చేరాలని విద్యార్థులు ఆలోచిస్తున్నారు. తెలంగాణలో ఈ నెల 22వ తేదీ లోపు ఫీజులు చెల్లించాలని ఆ రాష్ట్రం చెబుతోంది. ఒకవేళ అక్కడ ఫీజు చెల్లించలేకపోతే ఉన్న కళాశాలలో సీటు పోతుందని, ఫీజు చెల్లిస్తే ఇక రాష్ట్రంలో చేరేందుకు అవకాశం ఉండదని విద్యార్థులు ఆలోచిస్తున్నారు. టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల కంటే ఇతర రాష్ట్రాల్లో ఐఐటిలో చేరేందుకు ఇష్టపడుతున్నారని ఉన్నత విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో కూడా మంచి కళాశాలలు ఉన్నాయని, ముందుగా అడ్మిషన్ల ప్రక్రియ చేపడితే ఇతర రాష్ట్రాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గే అవకాశం ఉంటుందని విద్యావేత్తలు అంటున్నారు. రాష్ట్రప్రభుత్వం ఆలస్యం చేయడం వల్ల రాష్ట్ర విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్తున్న పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అసైన్డ్ భూములపై పునఃపరిశీలించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తామని" మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు. ప్రధాన ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు నాయుడు కూడా నెల్లూరు జిల్లా బాలాయిపాలెం మండలంలో 500 ఎకరాల అసైన్డ్ భూమి పొందినట్లు చెప్పారని వివరించారు. ఇవేకాక రాష్ట్రంలో అనేకమంది భూస్వాముల దగ్గర అక్రమంగా లక్షలాది ఎకరాలు ఉన్నట్లు తెలిపారని, ఈ భూములన్నీ వెనక్కి ఇప్పిస్తామని కూడా రాజశేఖర్ రెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు. చట్టం ఉన్నప్పటికీ 25 లక్షల ఎకరాల దళితులకు చెందిన అసైన్డ్ భూమి అన్యాక్రాంతం అయ్యిందని తెలిపారు. దళితులు, ఇతర పేదలు వారి భూముల పరిరక్షణ కోసం ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసుకొని అధికారుల చుట్టూ తిరుగుతున్నారని వివరించారు. అనేక కేంద్రాల్లో 12 లక్షల ఎకరాల్లో పేదలు సంఘటితపడి భూములకోసం పోరాడుతున్నారని వెల్లడించారు. న్యాయస్థానాల్లో సైతం భూవివాదాలున్నాయని, ప్రభుత్వం పేదల పక్షంలో నిలబడి ఈ భూములు తిరిగి పొందేందుకు సహకరించాలని కోరారు. భూమి లేని పేదలకు 54 వేల ఎకరాలకు పైగా పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కానీ పేదలకు పంచడానికి ప్రభుత్వ భూములతో పాటు 16 రకాల భూములు సుమారు 25 లక్షల ఎకరాలకు పైగా ఉన్నట్లు కోనేరు రంగారావు కమిటీతో పాటు ప్రభుత్వ నివేదికలు కూడా చెప్తున్నాయని వివరించారు. ఈ భూముల్ని కూడా పంచాలని కోరారు.

ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలి

రాష్ట్రంలో పేదలు సుమారు 4 నుండి 5 లక్షల మంది ప్రభుత్వ కాల్వగట్టు, రహదారుల పక్కన గ్రామ కంఠం, ఇతర స్థలాల్లో గుడిసెలు, నివాసాలు ఏర్పరుచుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వీరు హక్కులు కల్పించాలని, పట్టాలిప్పించమని ప్రభుత్వాలను కోరుతున్నారని వివరించారు. కాబట్టి అర్హులందరినీ గుర్తించి తక్షణమే నివాస స్థలాలకు పట్టాలు ఇచ్చి, వారికి ప్రభుత్వమే పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఇప్పటికే నివాసముంటున్న వారిని ఖాళీ చేయించి జగనన్న కాలనీలకు వెళ్లాలని అధికారులు పలుచోట్ల బలవంతం చేస్తున్నారని, దీనిని తక్షణం ఆపాలని కోరారు. విడిపోయిన కుటుంబాలు, కొత్తగా పెళ్లయిన వారికి జగనన్న కాలనీలలో వసతి కల్పించాలని, ఇప్పటికే నివాసం ఉంటున్న వారికి వారున్నచోటనే పట్టాలు ఇవ్వాలని కోరారు. పేదల అభ్యున్నతి కోసం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆరు సూచనలు చేశారు. అసైన్డ్ భూముల రక్షణ కోసం తెచ్చిన పిఒటి యాక్ట్ (9/77) చట్టాన్ని యథావిధిగా అమలు చేయాలని సూచించారు. ఒక వేళ భూమి పొందిన దళితులు, ఇతర పేదలు తమ అవసరాల కోసం అమ్ముకోదలిస్తే 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వమే కొనుగోలు చేసి అదే గ్రామంలోని ఇతర భూమిలేని వారికి, పేద రైతులు, కౌలుదారులకు పంచాలని కోరారు. పేదలకు భూపంపిణీ కోసం రాష్ట్రంలో అవకాశం ఉన్న అన్ని రకాల భూములను గుర్తించి అసైన్డ్‌మెంట్ కమిటీల ద్వారా పేదలను గుర్తించి పంపిణీ చేయాలని తెలిపారు. రెండున్నర ఎకరాల మాగాణీ లేదా ఐదెకరాల మెట్ట లోపు ఉన్న దళితులు, ఇతర పేదలు అసైన్‌మెంటు భూమి కలిగి ఉంటే అలాంటి వారికి లేదా వారి వారసులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. కోనేరు రంగారావు భూ కమిటీ నివేదిక ప్రకారం ఇప్పటికే ఐదెకరాలు పైన అసైన్డ్ భూములు అక్రమంగా అనుభవిస్తున్న వారి చేతిలో ఉన్న భూమిని వెనక్కి తీసుకొని అదే గ్రామంలో పేదలకు పంపిణీ చేయాలని సూచించారు. ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలని కోరుతున్న అర్హులందరికీ పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పై సమస్యలన్నింటి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు.

ఇప్పటికీ గుడారాల్లోనే..

'పోలవరం' వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

2022 వరదల ప్రభావం నుంచి నేటికీ తేరుకోని నిర్వాసితులు



గత ఏడాది వరదల సమయంలో దెబ్బతిన్న ఇంట్లోనే బతుకీడుస్తున్న వి.ఆర్.పురం మండలం ధర్మతాళ్లగూడెం వాసి సోడి రాములమ్మ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు సోడి జానకమ్మ. చింతూరు మండలం మల్లెతోట. గత ఏడాది వచ్చిన గోదావరి వరదల కారణంగా ఆ గ్రామమంతా పూర్తిగా ముంపునకు గురైంది. దీంతో, ఆమె ఇల్లు కూలిపోయింది. వరదలు తగ్గిన కొంతకాలానికి ప్రభుత్వం రూ.10 వేలు మాత్రమే ఇచ్చింది. వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్న ఆమె వద్ద అంత పెద్ద మొత్తం లేకపోవడంతో పైకప్పు మాత్రమే ఏర్పాటు చేసుకున్నారు. చుట్టూ గోడలు లేకుండా జీవనం సాగిస్తున్నారు. ఎండ, వాన, చలి నుంచి రక్షణ కరువై ఇబ్బంది పడుతున్నారు. ఆమె భర్త అనారోగ్యంతో చనిపోవడంతో కుటుంబ పోషణకు అన్నీ తానై శ్రమిస్తున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు జల్లి వీరయ్య. వి.ఆర్.పురం మండలం ధర్మతాళ్లగూడెం. వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గత ఏడాది వచ్చిన వరదలకు ఇంటి వాసాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం నుంచి సాయం లభించలేదు. అడవి నుంచి కలప తెచ్చుకుందామని ప్రయత్నిస్తే అటవీ శాఖాధికారులు ఒప్పుకోవడం లేదు. దీంతో, కప్పు కూలిపోయిన ఇంటిలోనే జీవనం సాగిస్తున్నారు.

ఈ సమస్య ఆ రెండు కుటుంబాలకు పరిమితమే కాదు. గత ఏడాది వచ్చిన గోదావరి వరదలకు ఇళ్లు కూలిన పోలవరం నిర్వాసిత మండలాల్లోని చింతూరు, కూనవరం, వి.ఆర్.పురం, ఎటపాకల్లో పలు కుటుంబాల పరిస్థితి కూడా ఈ విధంగానే ఉంది. 2022 జులై, సెప్టెంబర్లలో గోదావరి వరదలు ఒక్కసారిగా వచ్చిపడ్డాయి. ఒక్కసారిగా జలప్రళయం ఊళ్లకు రావడంతో ప్రాణాలు అరచేత పట్టుకుని ప్రజలు పరుగులు తీశారు. కొండలు, గుట్టలు, అడవుల్లో తలదాచుకున్నారు. పోలవరం వద్ద నీటిమట్టం 37 మీటర్లకు చేరుకోవడంతో వరద నీరు గ్రామాల్లోకి చొచ్చుకొచ్చింది. శబరి పరివాహక ప్రాంతాలు సైతం పూర్తిగా నీట మునిగాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి వరద తగ్గాక చింతూరు మండలం చట్టి, వేలేరుపాడులో సభలు నిర్వహించారు. ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.10 వేలు చొప్పున అందిస్తామని భరోసా ఇచ్చారు. ఆచరణలో భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. కేవలం కూలిపోయిన గుడిసెలను మాత్రమే పరిగణలోకి తీసుకున్నారు. వీటిలోనూ 20 శాతం ఇళ్లకే పరిహారం అందించారు. వి.ఆర్.పురం మండలం సోములగూడెంలో 150 ఇళ్లకుగాను 60 పూరి గుడిసెలు పూర్తిగా నేలమట్టమవ్వగా వాటిలో 12 ఇళ్లకు, చింతూరు మండలం మల్లెతోటలో 170 ఇళ్లకుగాను వాటిలో 40 ఇళ్లకు మాత్రమే రూ.10 వేలు చొప్పున ప్రభుత్వం నుంచి పరిహారం అందింది. కూనవరం, ఎటపాక మండలాల్లోనూ ఇటువంటి ఉదాహరణలు ఉన్నాయి. పూరి గుడిసె పున్ర నిర్మించుకునేందుకు తాటి ఆకులు, వాసాలు, మొత్తం కలిపి సుమారు రూ.60 వేలు ఖర్చవుతుందని బాధితులు తెలిపారు. ఇళ్లల్లో బురద నిలిచిపోవడంతో వాటిని తొలగించుకునేందుకు ఇంటి విస్తీర్ణం ఆధారంగా రూ.10 వేలు నుంచి రూ.25 వేలు వరకూ వెచ్చించక తప్పలేదు. ఇది అదనపు భారమైంది. ఇంటి పునఃనిర్మాణ వ్యయం వెచ్చించలేక బాధితులే అనేకమంది పైకప్పు మాత్రమే వేసుకుని జీవిస్తున్నారు.



నెల్లూరులో నిర్వహించిన మహిళల పోరు యాత్రలో పాల్గొన్న ఐద్వా నేతలు

మద్యం.. మత్తుపదార్థాలను నిషేధించాలి : ఐద్వా

ప్రజాశక్తి-నెల్లూరు

మద్యం, మత్తు పదార్థాలను నిషేధించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో మహిళల పోరు యాత్ర ఆదివారం చేపట్టారు. ఈ యాత్రను నెల్లూరు 53వ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరపురం సెంటర్లో ఐద్వా సీనియర్ నాయకురాలు జక్కా శేషమ్మ ప్రారంభించారు. మూడు రోజులపాటు ఈ యాత్ర సాగనుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం, మత్తు పదార్థాల వల్ల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయని తెలిపారు. 2019 ఎన్నికల ప్రచారంలో రాష్ట్రంలో దశల వారీగా మద్యపాన నిషేధం అమలు చేస్తామని హామీ ఇచ్చిన జగన్మోహన్రెడ్డి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. మద్యం ద్వారా ఖజానా నింపుకుంటున్నారని విమర్శించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ బీ మాట్లాడుతూ మద్యం, మత్తు పదార్థాలని నిషేధించాలనే ప్రధాన ఆజెండాగా జిల్లా వ్యాప్తంగా ఈ పోరు యాత్ర జరుగుతుందని తెలిపారు. తొలి రోజు వెంకటేశ్వరపురం నుంచి ప్రారంభమై కొత్తగుంట రోడ్డు, బొల్లినేని సెంటర్, వివేకానంద నగర్, డ్రైవర్స్ కాలనీ, సుందరయ్య కాలనీ, ముత్తుకూరు గేటు సెంటర్, టిపి గూడూరు, భగత్ సింగ్ కాలనీ, జనార్దన్రెడ్డి కాలనీ, పూలే విగ్రహం వరకు సాగింది. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు షేక్ మున్వర్ సుల్తానా, షేక్ శంషాద్ బేగం, కత్తి పద్మ, ఎం ప్రమీల, సుబ్బమ్మ పాల్గొన్నారు.



నిలకడగా గోదావరి ప్రవాహం

ప్రజాశక్తి - పోలవరం(ఏలూరు జిల్లా)

పోలవరం వద్ద గోదావరి నీటి మట్టం ఆదివారం నిలకడగా ఉంది. శనివారం ఉదయం నీటిమట్టం అనూహ్యంగా పెరగడంతో ధవళేశ్వరం వద్ద 175 గేట్లను 20 మిల్లీమీటర్ల మేర ఎత్తి 1,31,97 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. శనివారం సాయంత్రానికి 16.967 మీటర్లుగా ఉన్న గోదావరి నీటిమట్టం 16.947 మీటర్లకు తగ్గింది. ప్రస్తుతం కొద్దిమేర తగ్గి నిలకడగా ప్రవహిస్తోంది. ఉభయగోదావరి జిల్లాలకు 10,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో పోలవరంలో గోదావరి నీటిమట్టం నిలకడగా మారింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వేకు చేరుకుంటున్న అదనపు వరద జలాలను ఎప్పటికప్పుడు జలవనరుల శాఖ అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు.

యడవల్లిలో మరోసారి దళితుల భూపోరాటం

- గ్రానైట్ పేరుతో ప్రభుత్వం లాక్కున్న భూముల్లో విత్తనాలు
- భూమికి భూమి లేదా చట్ట ప్రకారం పరిహారం ఇచ్చేంత వరకూ సాగు చేస్తామని ప్రకటన



ట్రాక్టర్తో భూమిని దున్నుతున్న కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ

ప్రజాశక్తి - చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం యడపల్లిలో దళిత రైతులు ఆదివారం మరోసారి భూ పోరాటానికి దిగారు. ప్రభుత్వం తమ వద్ద గ్రానైట్ పేరుతో తీసుకున్న భూములకు పరిహారంగా మరోచోట భూములివ్వాలని, లేదా సరైన పరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ రెండింటిలో ఏదో ఒకటి నెరవేరే వరకూ తమ భూములను తామే సాగు చేసుకుంటామని స్పష్టం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), ఎంఆర్పిఎస్ నాయకుల మద్దతుతో దళితులు భూములను దున్ని ఖరీఫ్ సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. తొలుత బాధిత దళితులంతా తమ ప్రాంతాల నుండి పొలలకు జెండాలు పట్టుకుని ప్రదర్శనగా వెళ్లారు. అనంతరం ట్రాక్టర్తో కొంత భాగాన్ని దున్ని జొన్న విత్తనాలు వేశారు. మిగతా పొలాలనూ దున్ని వేర్వేరు పంటలు సాగు చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వైవై రాధాకృష్ణ మాట్లాడుతూ దళితులకు జీవనాధారంగా ఉన్న భూములనే ప్రభుత్వం లాక్కోవడంతో వారంతా పస్తులుండాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. 1975లో 416 ఎకరాలను 120 కుటుంబాలకు సొసైటీగా ఏకపట్టాగా ఇచ్చారని, ఒక్కో కుటుంబానికి మూడెకరాల చొప్పున అప్పటి కలెక్టర్ పంపిణీ చేశారని తెలిపారు. అప్పటి నుండి వాటిని సాగుచేసుకుంటూ ఆయా కుటుంబాలు జీవనోపాధి పొందాయని, అయితే అందులో గ్రానైట్ ఉందనే పేరుతో వైసిపి ప్రభుత్వం తీసుకుందని చెప్పారు. మార్కెట్ విలువ ఎకరం రూ.12 లక్షల నుండి రూ. 15 లక్షలుండగా ప్రభుత్వం మాత్రం రూ.8.33 లక్షలే ఇచ్చిందని తెలిపారు. ఇదే గ్రామంలో ఇళ్ల పట్టాల పంపిణీ కోసం ఎకరా రూ.24 లక్షలకు ప్రభుత్వం కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. 20 ఏళ్లుగా వ్యవసాయం చేసుకునే భూములకు పట్టా హక్కు కల్పిస్తామని సిఎం చెబుతున్నారని, యడవల్లి రైతులకూ ఆ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి శివనాగరాణి, పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ లక్ష్మీశ్వరరెడ్డి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జి రవిబాబు, ఎంఆర్పిఎస్ పల్నాడు జిల్లా కన్వీనర్ ఎ బాబు, బాధిత దళితులు, మహిళలు పాల్గొన్నారు.



బంగారు శంఖాన్ని ఇఒ ధర్మారెడ్డికి అందజేస్తున్న సుధా నారాయణమూర్తి

తిరుమల శ్రీవారికి ఇన్ఫోసిస్ బంగారు కానుక

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారికి రూ. కోటి 25 లక్షల విలువ చేసే రెండు కిలోల బంగారు శంఖం, కూర్మ పీఠాన్ని ఇన్ఫోసిస్ అధినేత సుధా నారాయణమూర్తి దంపతులు విరాళంగా ఇచ్చారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తుల కైంకర్యాలకు వీటిని వినియోగించేందుకు ఇఒ ధర్మారెడ్డికి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి దంపతులను ఇఒ శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అంతకుముందు వారు కుటుంబసభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.

ఆధిపత్యం కోసమే హత్య : ఎస్పి దీపిక

- ఉపాధ్యాయుడి హత్య కేసులో నలుగురు నిందితులు అరెస్టు



విలేకర్ల సమావేశంలో నిందితులను చూపుతున్న ఎస్పి ఎం.దీపిక

ప్రజాశక్తి-విజయనగరం, బొబ్బిలి

గ్రామంలో ఆధిపత్యం కోసం, ఆర్థికంగా నష్టపరిచాడన్న కారణంతో విజయనగరం జిల్లా తెర్లాం మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణను ప్రత్యర్థులు హత్య చేశారని ఎస్పి ఎం.దీపిక తెలిపారు. హత్యకు పాల్పడిన నలుగురు నిందితులను అరెస్టు చేశామని, మరొక నిందితుడి కోసం గాలిస్తున్నామని చెప్పారు. హత్య కేసుకు సంబంధించిన వివరాలను విలేకర్ల సమావేశంలో ఆమె ఆదివారం వెల్లడించారు. ఉద్దవోలు గ్రామంలో ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణ క్రియాశీలకంగా వ్యవహరించేవారు. గత కొన్నేళ్లుగా అదే గ్రామానికి చెందిన మరడాన వెంకటనాయుడు కుటుంబంతో గ్రామంలో ఆధిపత్యం కోసం గొడవలున్నాయి. వెంకట నాయుడు గ్రామంలో ప్రభుత్వ భవనాలకు కాంట్రాక్టు పనులు చేశారు. బిల్లులు మంజూరు కాకుండా కృష్ణ అడ్డుపడుతున్నారనే అనుమానంతో కక్ష పెంచుకున్నారు. ఆయనను చంపేస్తే తమ కక్ష తీరడంతోపాటు, గ్రామంలో ఆధిపత్యం సాధించవచ్చని భావించారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి పథకం ప్రకారం కృష్ణను హత్య చేసేందుకు రెక్కీ నిర్వహించారు. శనివారం ఉదయం పాఠశాలకు బైక్పై బయలుదేరిన సమాచారాన్ని వెంకట నాయుడుకు, ఆయన సోదరుడు మరడాన మోహనరావుకు అందించారు. మోహనరావు, రెడ్డి రాము కలిసి బొలేరో వాహనంతో కృష్ణను వెంబడించి వెనుక నుంచి ఢీకొట్టారు. వాహనాన్ని ఆపి ఆయన ముఖంపై ఇనుప రాడ్డుతో విచక్షణారహితంగా కొట్టి చంపేశారు. హత్య అనంతరం నిందితులు బొలేరో వాహనాన్ని సంఘటనా స్థలంలోనే విడిచిపెట్టి పరారయ్యారు. ఈ కేసులో దర్యాప్తును ప్రారంభించిన రాజాం పోలీసులు ప్రధాన పాత్ర పోషించిన మరడాన మోహనరావు, రెడ్డి రాము, మరడాన వెంకటనాయుడు, మరడాన రామస్వామిలను అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు.

ఉద్రిక్తతల నడుమ అంత్యక్రియలు

ఉపాధ్యాయుడు కృష్ణ మృతదేహానికి తీవ్ర ఉద్రిక్తతల నడుమ ఆదివారం స్వగ్రామం ఉద్దవోలులో అంత్యక్రియలు జరిగాయి. కృష్ణను హత్య చేసిన వారి ఇళ్లపై ఆయన బంధువులు, గ్రామస్తులు దాడులు చేశారు. గడ్డి కుప్పలకు నిప్పు పెట్టారు. ప్రత్యర్థుల కారు, ఇంటి అద్దాలను ధ్వంసం చేశారు. దాడి విషయం పోలీసులకు తెలియడంతో ఉద్దవోలులో భారీ బందోబస్తు నిర్వహించారు. ఉద్రిక్తత పరిస్థితులను అదుపు చేశారు. ఆందోళనకారుల నుంచి పెట్రోల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. కృష్ణ అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, మండల నాయకులు హాజరయ్యారు.

ఉపాధ్యాయుని హత్య దారుణం

- చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో :

ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణ హత్యను టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఖండించారు. రాజకీయ కారణాలతో ఒక ఉపాధ్యాయుడిని చంపడం దారుణమని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ దాడులపై ప్రభుత్వ పెద్దల, అధికారుల ఉదాసీన వైఖరే ఇలాంటి ఘటనలకు కారణమని పేర్కొన్నారు. బాధితుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



బోసు కుమారునికి టిక్కెట్ కేటాయించాలని సమావేశంలో తీర్మానం చేస్తున్న కార్యకర్తలు

మంత్రి వేణుపై వ్యతిరేకత

- బ్రిటీష్ పాలను తలపిస్తోందని వైసిపి శ్రేణుల ఆగ్రహం

ప్రజాశక్తి - రామచంద్రపురం(డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా)

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ఎమ్మెల్యే, బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు సొంత పార్టీలోనే వ్యతిరేకత మొదలైంది. ఆయన తీరుపై స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలనాటి బ్రిటిష్ పాలనను తలపిస్తోందని మండిపడ్డారు. రామచంద్రపురం మండలం ద్రాక్షారామంలోని సాయి మాధవానంద ఫంక్షన్ హాల్లో ఆదివారం వైసిపి కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జడ్పిటిసి మాజీ సభ్యులు ఇ సంతోషం, వైసిపి కార్యకర్తలు డి శ్రీధర్, పొలినాటి ప్రసాద్, శ్యామ్ ప్రసాద్, మల్లేశ్వరరావు మాట్లాడారు. నాలుగేళ్లుగా నియోజకవర్గంలోని కార్యకర్తలను మంత్రి వేణు పట్టించు కోవట్లేదన్నారు. బోస్ అనుచరునిగా వచ్చి బోస్ అనుచరులను అణగతొక్కారని ఆరోపించారు. తన గ్రూపును పెంచుకునేందుకు కార్యకర్తలను వేధింపులకు గురి చేశారని విమర్శించారు. అంతేకాకుండా తప్పుడు కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పనికి లంచం తీసుకుంటూ అవినీతి అనకొండగా మారారని ఆరోపించారు. ఆయన కుమారుడు నరేన్ రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అవినీతి సొమ్ముతోనే రామచంద్రపురంలో రూ.ఐదు కోట్లతో మంత్రి భవనాన్ని నిర్మించారని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో వేణుకు సీటిస్తే ఓడిస్తామని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో బోసు తనయుడు సూర్య ప్రకాష్కు వైసిపి టికెట్ కేటాయించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో కె గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

22 మంది పేద రోగులకు క్లిష్టమైన చికిత్సలు

- డయల్ యువర్ ఇఒలో ధర్మారెడ్డి

ప్రజాశక్తి- తిరుమల:

దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన 22 మంది వైద్యులతో మోకీలు మార్పిడి, తుంటి మార్పిడికి సంబంధించి 22 మంది పేద రోగులకు క్లిష్టమైన చికిత్సలు ప్రత్యక్షంగా చేయించామని, వివిధ ప్రాంతాల నుంచి అనేకమంది వైద్యనిపుణులు బర్డ్ ఆస్పత్రికి వచ్చి సేవలు అందిస్తున్నారని టిటిడి ఇఒ ధర్మారెడ్డి తెలిపారు. పేదరోగులకు ఉచితంగా వైద్యసేవలు చేయడానికి ముందుకు వచ్చే డాక్టర్లకు వసతి, రవాణా భోజనం సౌకర్యాలను టిటిడి కల్పిస్తోందన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో ఆదివారం జరిగిన డయల్ యువర్ ఇఒ కార్యక్రమం జరిగింది. అనంతరం ఇఒ ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ వేసవి రద్దీ నేపథ్యంలో కుదించిన రూ.300లు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను అదనంగా మరో నాలుగు వేలను ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఆన్లైన్ ద్వారా జారీ చేస్తామన్నారు. సందర్శకుల సౌకర్యార్థం లగేజీ కేంద్రాలను ట్రాకింగ్ విధానం ద్వారా సేవలు అందించేందుకు మరో నెలరోజుల్లో అమలు చేయనున్నామని అన్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా ఇప్పటికీ తొమ్మిది లక్షల మంది దర్శించుకున్నారని, ఒక సందర్శకుడైనా ట్రస్టుపై ఆరోపణలు చేయలేదన్నారు. శ్రీవాణి ట్రస్టుపై వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా నిర్మించే ఆలయాలను మూడు కమిటీల ద్వారా నిధులను మంజూరు చేస్తున్నమన్నారు. తిరుమల స్థానిక పార్వేట మండపాన్ని జీర్ణోద్ధరణలో భాగంగానే కూల్చివేసి మరో మండపాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. ఘాట్ రోడ్డుల్లో ఆర్టిసిలో ప్రయాణించేవారు వ్యర్థాలను బస్సుల్లో ఏర్పాటు చేసే చెత్త కుండీలో వేయాలని కోరారు. జూన్ నెలలో శ్రీవారిని 23 లక్షల మంది సందర్శించారని, రూ. 116.14 కోట్లు ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఇఒలు సదా భార్గవి, వీరబ్రహ్మం, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్ఇ-2 జగదీశ్వర్ రెడ్డి, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీదేవి, అన్న ప్రసాదం ప్రత్యేకాధికారి శాస్త్రి, విజిఒ బాలిరెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

20 మంది ఎర్రచందనం కూలీలు అరెస్ట్

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం)

అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో టాస్క్ ఫోర్సు పోలీసులు కూంబింగ్ చేపట్టి 19 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారని టాస్క్ఫోర్సు డిఎస్పి మురళీధర్ తెలిపారు. దుంగలను అక్రమంగా తరలిస్తున్న 20 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు వివరాలను ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. దీని ప్రకారం.. కర్నూలు రేంజి డిఐజి సెంథిల్ కుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ కె.సురేష్ కుమార్రెడ్డి నేతృత్వంలో ఆర్ఎస్ఐలు సురేష్ బాబు, వై.విశ్వనాథ్, కెఎస్కె.లింగాధర్ మూడు బృందాలుగా ఏర్పడి కూంబింగ్ చేపట్టి మొత్తం 20 మందిని అరెస్టు చేశారు. వారిని తమిళనాడు చెందినవారికి గుర్తించారు. వీరిని టాస్క్ఫోర్సు పోలీసు స్టేషన్కు తరలించారు. మరికొంత మంది అడవుల్లో ఉన్నారని సమాచారం.



“సాగిపోవుటె బతుకు
ఆగిపోవుటె చావు
సాగిపోదలిచిన
ఆగరాదిచటెపుడు ”

– కాళోజీ



హోరు

తనను కలవాలని
తన ఆలింగనంలో కరగాలని
ఎప్పటినుంచో లోలోపలి కోరిక
బాధ్యతల కొక్కేనికి
బతుకు కళేబరాన్ని వేలాడదీసాక
నాలుగ్గోడల బంధనంలో ఊపిరాడక
ఎప్పటికప్పుడు అంధకారపు కారాగారంలో ...

***

ఎంతో కాలం తర్వాత
నీ చెంత చేరుతున్నప్పుడు
అతిథికి స్వాగత గీతం పాడుతున్నట్లు
అంత దూరాన్నుంచే ఒకటే హెూరు
అంతెత్తున ఎగసిపడే అలలతో
ఒడలు తడిసి తన్మయమైనా ...

***

ముసలి మొగుళ్ళ కౌగిళ్లలో
బాల్య వివాహపు ఉరికంబాల్లో
సతీ సహగమనం జ్వాలల్లో బాధితులు
నిర్భయ నుంచి ఆసిఫాలు
వాకపల్లి ఆదివాసీల
అత్యాచారాల దు:ఖాల గుణకారాల
కన్నీటి జీరలు మనసుని మెలిపెడ్తుంటే ...


***

ఆనాటి అందాల ప్రతిమలు ఆట బొమ్మలనుంచి
పిట్టలు చేపలు సరుకులు వస్తువులు వరకు మారిన
మాయాప్రపంచంలో
తరతరాలుగా చెక్కిళ్లపై జారిన
ఉప్పని కన్నీటి ప్రవాహాల హెూరు

***

ఇంటికి వచ్చినా చెవుల్లో మారుమోగే
ఇంతుల నిరంతర దు:ఖాల వెక్కిళ్లు !

– మందరపు హైమవతి



కూలుతున్న దృశ్యాలు

ఒంటరిగా కాదు
నలుగురూ నడిచే రహదారిపైకెళ్ళగానే
తమలో తామేదో వెకిలినవ్వులతో ఎదురవుతూ
నాలో నేను చిత్రించుకున్న ఊహాసౌధాలన్నీ
ఒక్కొక్కటిగా కూలుతున్న దృశ్యాలు

ఇంతకాలమూ
నా చుట్టూ బూతద్దాలే ఉన్నాయేమో
ఒక్కదానిలోనూ నేనెలా కనిపిస్తున్నానో
నాకేమాత్రం నిజం తెలియనివ్వలేదని
గుసగుసలాడుకుంటూ నిజ దర్పణంలో
శకలాలు శకలాలుగా కూలుతున్న దృశ్యాలు

అమాయకత్వం కాకపోతే
నీటిమట్టంలాగానే
నీటి అడుగునా ఒకేలా ఉండదు కదా
ఆంతరంగికులెవరో
అట్టడుగున ఎత్తుపల్లాల్ని చేయి పట్టి చూపగానే
అప్పుడే నడక నేర్చుకుంటున్న పసివాడి పాదాల్లా
తడబడుతూ కూలుతున్న దృశ్యాలు

ఆ మైదానంలోకి చేరగానే చిరు జల్లులేవో
కుంభవృష్టులతో జత కట్టినట్లున్నాయి
ప్రవహించి ప్రవహించి
దు:ఖం ప్రవాహమై పరుగులిడుతోంది
ఆకాశంలోని నీళ్ళన్నీ పిండేసాక
కూలుతున్న దృశ్యాలు కనబడవు
నేలను ముద్దాడుతున్న ఆకాశం సిగలో
చిత్రితమైన సౌందర్యాత్మక దృశ్యంలో
ఒక ముత్యమేదో మెరుస్తోంది!

– దార్ల వెంకటేశ్వరరావు,
91826 85231

పోస్ట్‌మార్టం రిపోర్ట్

పాలిండ్లేమిటి ఇంత పెద్దగా వున్నాయి?
వేళ్ల వెడ్పు చేసి గట్టిగా పిసికాడు
బుళక్కన నెత్తురొచ్చింది–
ఛీఛీ..

కళ్లేమిటి ఇంత విశాలంగా వున్నాయి?
వేళ్లతో పొడిచి లోనికి తొంగిచూశాడు
తరతరా కష్టాలుబికాయ్
ఛీఛీ..

నడుమేమిటి నడివీధిలోకి వచ్చింది?
చేయి చాచి ఒక్క నొక్కు నొక్కాడు
పంక్చరైన లారీ టైర్‌లా..
పుసుక్కున ముడుచుకుపోయింది–
పొగరుగా నవ్వాడు!

ఏమిటో దాచిపెట్టావ్?
బొందు పట్టుకు సర్రున లాగేసాడు
మటన్ షాపులో తలకిందులుగా వేలాడదీసిన
మేకలా మే..మే.. అంది
గర్వంగా మీసం మెలేసాడు!

పైకొచ్చి చూశాడు.. పెదవి మాటునేముందో?
సారముడిగి, పెచ్చులు దేలిన పచ్చని భూమిలా
నాలిక గిడసబారిపోయింది–
శభాష్ అంటూ తన భుజం తానే చరుచుకున్నాడు
కన్నీటితో నానిన చెంపల్లోకి
పొడుచుకొచ్చిన నాసిక చుట్టూ ఏమిటి?
పొగచూరిన వంటింటి మసాలా జిడ్డు–
నీళ్లూరుతున్న నాలికతో పెదాలు తడుపుకున్నాడు

శరీరాన్ని చుట్టి వచ్చాడు
అయినా, సందేహం తీరలేదు
రెక్కలు విప్పినట్లు ఆ చెవి డొప్పలేమిటో?
తాకీతాకగానే ప్రపంచం చెవులు చిల్లు పడేలా
ఓ స్వరం విరుచుకు పడింది
'యత్ర నార్యస్తు పూజ్యంతే' అని.

'గుడ్.. వెరీ గుడ్, ఎవ్రీథింగ్ ఈజ్ ఫైన్'

మగ సంతకం గీకేశాడు!

– దేశరాజు

దళితస్త్రీ అస్తిత్వ సంవేదనలు ఎదారి బతుకులు

సమీక్ష





ఎదారి బతుకులు
పల్లెకతలు
ఎండపల్లి భారతి

ఎండపల్లి భారతి మట్టిలో మాణిక్యం. ఆమె 2016లో 'ఎదారి బతుకులు' కథాసంపుటి ద్వారా అనతికాలంలోనే మంచి పసకలిగిన రచయిత్రిగా పేరు తెచ్చుకున్నారు. పూర్వ చిత్తూరు జిల్లా మదనపల్లె సమీపంలోని గారబురుజు, కర్ణాటక సరిహద్దుల్లోని ముదిమడుగు ప్రాంతాల్లోని దళితస్త్రీల జీవితాలు ఎదారి బతుకుల్లో కథలకు ఇతివృత్తాలు.

ఈ కథల్లో శాస్త్రీయ భౌతికవాదం, నిసర్గమైన దళితవాదం, బలమైన దళితస్త్రీ అస్తిత్వ సంవేదనలు కనిపిస్తాయి. భారతి దళిత జీవితాన్ని స్వయంగా జీవించి, ఆ కష్టాన్ని, ఆ నొప్పిని అనుభవించి రాసిన రచయిత్రి కావడం వల్ల కథల్లో ఆ సహజత్వం కొట్టొచ్చినట్టు కనబడుతుంది. ఈ కథలు దళిత జీవితాల్ని వర్ణిస్తాయి. దళితస్త్రీ జీవితాల్ని విపులంగా వర్ణిస్తాయి. ఆ జీవితాల్లోని సమస్యల్ని చూపి, ఇంత దుర్భరమైన జీవితాలు ఇంకా ఉన్నాయా? ఇంత అణచివేత, ఇంత అన్యాయం ఇంకా జరుగుతున్నదా? ఇంత అనాగరికత ఇంకా ఉందా? అని విస్మయం చెందేలా చేస్తాయి. కానీ సదరు సమస్యలకు పరిష్కారాలు చూపే ప్రయత్నం చెయ్యాల్సిన స్థాయిలో చెయ్యలేదు. దానికి కారణం రచయిత్రికి ఉన్న పరిమితులు. ఆమె పెద్దగా చదువుకోలేదు. అయినా నిసర్గమైన ప్రతిభతో ఆమె దళిత జీవితాల్ని, దళితస్త్రీ జీవితాల్ని అక్షరబద్ధం చేసి భద్రపరుస్తున్నారు. అనుభవపూర్వకంగా పడ్డ ఆవేదనతో మౌలికంగా ప్రశ్నిస్తున్నారు.

శ్రమజీవులు కాబట్టి దళితస్త్రీలకు కుటుంబంలో నిర్ణయాధికారం ఉంటుందన్నది ఒక సాధారణ అభిప్రాయం. భారతి గారి కథల్ని చూస్తే ఈ అభిప్రాయాన్ని కొంతవరకూ సడలించుకోవాల్సి వస్తుంది. 'అంటిత్తులు' కథలో రంగమ్మత్త, రామ్మామ అని ఇద్దరు ఒద్దికైన దంపతులున్నారు. రంగమ్మ రామన్న మనసు గెలిచింది. అతనితో ఇంటి చాకిరీ, ఒంటి చాకిరీ చేయించుకుంటుంది. వాళ్ళ ఒద్దిక అలాంటిది. అందుకే ఊర్లోవాళ్ళు ఆ జంటకి అంటిత్తులు అని మారుపేరు పెట్టుకున్నారు. 'తాగుబోతు' కథలో లచ్చుమత్త మొగుడు కొండప్ప మొహమాట పెడితే ఒకసారి సారా తాగుతుంది. తర్వాత మొగునికి తెలియకుండా తాగుతూ పక్క తాగుబోతుగా తయారవుతుంది. ఆరోగ్యరీత్యా వైద్యుల సలహా మేరకు కొండప్ప తాగడం మానేసినా లచ్చుము తనకోసం సారా తెప్పించుకునే సాధికారత కలిగుంది. 'తప్పేది ఒప్పేది' కథలో కడింటి వదిన ఎవరు ఆకలితో ఉన్నా అంత కడిపెట్టే మనసు, అధికారం కలిగుంది. చివరకు తను పదిమందితో ఒళ్ళు పంచుకున్నా ఆమె భర్త ఆమెని ఏమీ అనడు. ఈ సకృత్తు ఉదాహరణలు తప్ప ఎదారి బతుకుల్లోని ప్రతి కథలో, ప్రతి ఇంట్లో స్త్రీ కుటుంబంలో నిర్ణయాధికారం లేకపోగా, నానా రకాల అణచివేతకు, హింసకూ గురవుతుంది. దీన్ని ఆవైతే పేయదూడ ఆడదైతే మగపిల్లోడు' కథలో సూచనాప్రాయంగా; ఇత్తలిబింది, నక్కాముట్టి, కథల్లో స్పష్టంగా చూడొచ్చు. ఈ కథల్లోని దళిత స్త్రీలు మహిళలుగా తమ అస్తిత్వాన్ని చాటుకోవడం కోసమే కాకుండా తమ కుటుంబ ఆర్థిక పరిస్థితుల్ని మెరుగుపరచుకుని మానవులుగా గౌరవాన్ని, సామాజిక అస్తిత్వాన్ని కాపాడుకోవాలని శతవిధాలా పాటుబడతారు. కూలీనాలీ చేస్తూ, పొదుపు పాటిస్తూ ఇంటికి ఒక్కొక్క వస్తువే కొనుక్కుంటూ ఉంటారు. ఇత్తలిబింది, వాసాలమింద కప్పడం, పూలపెట్ట, బొగ్గులబట్టి, చిక్కెంటుకులు, కడుపులు కాల్చిన కందిబేడలు, నల్లడబ్బు, పసావు కథల్లో ఇలాంటి ఆరాటం కనబడుతుంది. మరోపక్క మగవాళ్ళు పనిచేసి ఇంటిని చక్కబెట్టడం కాదు కదా, ఆడవాళ్ళు సంపాదించిన డబ్బుని లాక్కుని సారాకు తగలేస్తారు. ఆడవాళ్ళు పొదుపుచేసి కొనుక్కున్న చెంబుల్ని, బిందెల్ని కూడా ఇంటినుండి ఎత్తుకెళ్ళి అమ్మేసి పేకాటలో పోగొట్టేస్తారు. అలా ఆ దళితస్త్రీల అస్తిత్వ పోరాటం నీరుగారిపోతుంటుంది.

కాగా, ఆధునికతవల్ల మానవ సంబంధాలు అడుగంటిపోవడం శీర్షిక కథ ఐన 'ఎదారి బతుకులు', 'బొగ్గు దవడకేసుకుని' 'సచ్చినోళ్ళ గేపకం' కథల్లో చక్కగా వర్ణించబడింది. 'గంగమ్మే బెదిరిపోయె' కథ హాస్యకథలా అనిపించినా, లోతుగా పరిశీలిస్తే దళితస్త్రీలలోని ఆకలిబాధ తెలుస్తుంది. 'ఈరావ్వ ఏమి తినబెట్టిందో' కథలో ఈరావ్వ, 'మొగుని పొటుకులు' కథలో సాలత్త, 'పాపం గెంగవ్వ' కథలో గెంగవ్వ ఇంటిలో మొగుళ్ళ నుండి చెప్పుకోలేని లైంగికహింసకు గురవుతారు. 'అవ్వ తలపులు' కథలో లచ్చుమవ్వ రంగారెడ్డి, వరదారెడ్డి, యెల్లమొళ్ళ బుచ్చన్నల నుండి లైంగికహింసని ఎదుర్కొంటుంది. తన కోరిక తీర్చలేదన్న కసితో బుచ్చన్న చాడీలు చెప్పగా, తన మగడు కూడా తనని తన్ని తగలేసి ఇంట్లోనుండి తరిమేస్తే ఒక రాత్రంతా తను బిడ్డలతోబాటు అడవిలోని ఒక సత్రంలో బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తుంది. ఉన్నత కులాలు దాహం తీర్చుకోడానికి, పంటలు పండించుకోడానికి బావులు, చెరువులు తవ్వాల్సి వస్తే, పొలాల్లో పని చెయ్యాల్సి వస్తే దళితుల శ్రమని వాడుకోడానికి ఏమీ అడ్డురాదు. కానీ వాళ్ళకి గ్లాసుతో గుక్కెడు నీళ్ళు ఇవ్వాల్సి వస్తే కులం అడ్డొస్తుంది. తట్టలో పిడికెడు మెతుకులు పెట్టాల్సి వస్తే కులం అడ్డొస్తుంది. చివరకు వాళ్ళని తాకాల్సి వచ్చినా, వాళ్లకి దగ్గరగా కొంతసేపు ఉండాల్సి వచ్చినా కులం అడ్డొస్తుంది. కానీ వాళ్ళు చేసే కవుసుకూర తినడానికి కులం అడ్డురాదు. శ్రమజీవులైన దళితస్త్రీలను లైంగికంగా వాడుకోడానికి కులం అడ్డురాదు. ఇవి 'దప్పి', 'మాయన్న సదువు' 'కుట్టేవానికి మెట్టు కరువు' 'అవ్వ తలపులు' కథల్లో కనబడతాయి. '

'సచ్చి సాదించడం' కథలో ఇద్దరు ఆడవాళ్ళు తమని హింసించి తరిమేసిన తమ మొదటి మొగుడు చనిపోతే సమాజపు కట్టుబాట్లకి కట్టుబడి ప్రస్తుతం తమ భర్తలు బతికున్నా ముండ మొయ్యాల్సి వస్తుంది. దీనికి విరుద్ధంగా అంటిత్తులు, తాగుబోతు కథల్లో దళిత దంపతుల మధ్య అరమరలులేని స్వచ్ఛమైన ప్రేమ కనబడుతుంది.

దళితుల్లో మాల, మాదిగ అనేవి కులాలు కావు. శాస్త్రవేత్తలు, మేధావులు చెబుతున్నట్లు అవి ద్రవిడజాతిలో ఉపజాతులు. ద్రవిడ జాతిలోని భౌతికవాద దృక్పథం ఇప్పటికీ ఆ జాతుల్లో కనబడుతుంది. నాగరికత పేరుతో మానవ సంబంధాలను జటిలం చేసుకోవడం ఆ జాతి సహజ లక్షణం కాదు. అగ్రవర్ణాల్లో మనషులు చనిపోయినప్పుడు దళితులకు దానంగా పెట్టే సావు బియ్యం దళితులు కూడా తినరు. అలా తింటే అరిష్టం జరుగుతుందని ఒక అభిప్రాయం ఉంది. దాన్ని సాకుగా చేసుకుని దళిత పురుషులు ఇంట్లో పెళ్ళాం పిల్లలు ఆకలితో అల్లాడుతున్నా ఆ బియ్యాన్ని అంగడిలో అమ్మేసి వచ్చిన డబ్బుతో సారా తాగి జల్సాలు చేసుకుంటారు. 'సావుబియ్యం' కథలో సావు బియ్యం వండుకుని తిన్న కథకురాలికి వాళ్ళ నాన్న అది అరిష్టం అని చెప్పగా భయపడి ఆ విషయం బోయకొండవ్వకు చెబుతుంది. అప్పుడు బోయకొండవ్వ “తిక్కల బిడ్డా, సావుబియ్యమూ, బతుకుబియ్యమూ అని ఉండవు. కాలే కడుపును చల్లార్చే బియ్యమే ఉండేది. మగ నా బట్టలు ఇల్లూ వాకిలీ అనుకోకుండా సంపారిచ్చిందంతా సారాయంగట్లో పోసేసి వస్తుంటే నువ్వు మటుకు ఏమి చేస్తావు” అని భయం పోగొడుతుంది. అలాగే 'తప్పేది ఒప్పేది' కథలో కడింటి వదిన ఊళ్లోకి వచ్చిన అతిథులను ఎవరు పట్టించుకోకపోయినా తాను చేరదీస్తుంది. అంతకడి ఉడకేసి పెడుతుంది. చాప ఇచ్చి పడుకోమని చెబుతుంది. ఊళ్ళో అమ్మలక్కలు ఆమెపై ఏమేమో గుసగుసలుపోతారు. ఆమె ఒట్టి వ్యభిచారి అని, ఊర్లో మగోల్లందరికీ ఒళ్ళు అప్పగించేస్తుందని అభాండాలు వేస్తారు. అప్పుడే అక్కడికి వచ్చిన పెద్దమ్మ ఒక పిట్టకథ చెప్పి కష్టాల్లో ఉన్న సాటి మనిషిని ఆదుకునే గుణం లేని ఆ ఆడంగుల నోళ్ళని మూయిస్తుంది. అలాగే కథకురాలు తనని నిలదీసినప్పుడు కడింటి వదిన “అదికాదు బారతమ్మా, ఒకడు నన్నడిగినాడంటే, నామింద ఎంత ఆశించుకోనుంటాడు? నేను కాదంటే ఎట్లా? అదే నేను ఎవరిమిందన్నా ఆశ పడితే, వాళ్ళు కాదంటే, ఎంత వెతగా ఉంటాది? వాళ్లకు గూడా అంతే కదా.” అని చెబుతుంది.

అలా ఈ రెండు సందర్భాల్లో దళితజాతుల్లో ఉన్న భౌతిక దృష్టి స్పష్టంగా వెల్లడవుతున్నది. ఆ శాస్త్రీయ దక్పథం 'సమేదాసరి' కథలో కూడా కనబడుతుంది.

ఈ కథల్లో దళితభాషా సంస్క ృతులు సహజశోభలతో దర్శనమిస్తాయి. వాటిని అలా పిలవడం సమంజసం కాకపోతే కర్ణాటక సరిహద్దుల్లోని పుంగనూరు, రాయల్పాడు మధ్యలోని మదనపల్లె భాషా సంస్క ృతులని అని పిలవవచ్చు. అది కూడా సమంజసం కాదనిపిస్తే కర్ణాటక సరిహద్దుల్లోని పుంగనూరు, రాయల్పాడు మధ్యలోని మదనపల్లె ప్రాంత దళిత భాషా సంస్క ృతులని అని పిలవ్వొచ్చు. ఈ కథల్లోని భాష కొండకచో బూతుగా అనిపించవచ్చు. అదంతా జీవితంలో భాగమైనప్పుడు దాన్ని ఎలా ఆ జీవితాల నుండి విడదీయగలం? తీవ్రమైన, తీవ్రత అవసరమైన జీవిత సందర్భాల్ని వర్ణిస్తున్నప్పుడు కూడా భాషాపరమైన నియంత్రణ అవసరం ఏముంది?

అయితే, ఈ కథల్లో ధిక్కారస్వరం అంత స్పష్టంగా ఉండదు. ఎక్కడో కంటికి సరిగా కనిపించకుండా ఒక సన్నని పొరలాగా, చెవికి సరిగా వినిపించకుండా ఒక సన్నని జీరలాగా ఉంటుంది. అయినా అది చాలా మౌలికమైనది. మెతుకులో గట్టి లాంటిది. 'మాయన్న సదువు' కథలో కథకురాలి అన్న చదువు సజావుగా కొనసాగకుండా మధ్యలోనే నిలిచిపోడానికి, అతడు శ్రమజీవిగా మిగిలిపోడానికి అగ్రవర్ణ భావజాలానికి అలవాటుపడ్డ సహ విద్యార్థులు, అయ్యవార్లే కారణమన్న ధిక్కారం మసకమసగ్గా ఉంది. గురువుదేవర కథలో అది మరికొంత స్పష్టంగా కనబడుతుంది. ఈ కథల్లోని దళితస్త్రీలు కూడా తమ ఇళ్లలోని మగవాళ్ళ ఆగడాలకు నొచ్చుకుంటారే తప్ప తిరుగుబాటు చెయ్యరు. ఈ విషయమై రచయిత్రిని కదిపినప్పుడు తాను తన చుట్టూ కనిపిస్తున్న సమాజాన్ని తన చేతనైంతలో రాసుకొచ్చానని, ధిక్కారం లాంటి పదాలు కూడా తనకు తెలియవని చెప్పుకొచ్చారు. భారతి లాంటి రచయితలు ఇంకా రావాలి. వాళ్ళు ఉన్నత చదువులు చదివి జీవితాలను లోతుగా అధ్యయనం చేసి, వాళ్ళు రాస్తున్న జీవితాల్లోని సమస్యలకు సిద్ధాంతికమైన పరిష్కారాలని చూపించాలి. అవసరమైన చోట తమ ధిక్కారస్వరం సాధికారంగా వినిపించాలి.

– కవితశ్రీ

మేరా భారత్ మహాన్!

ఎప్పటికప్పుడు
ఏ వార్తను మరుగు పరచడానికి
ఏ వార్తను హైలైట్ చేయాలో
ఇప్పుడంతా సెంగోల్ బుర్రలకి
ఈడీతో పన్నిన విద్య!

బిరుసు గొంతుల మోషా బలంతో
ఫోర్త్ ఎస్టేట్ పునాది చుట్టూ
బెదిరింపుల బుల్డోజర్లు
కలియదిరుగుతున్నపుడు
వెలుగు చూడాల్సిన దాష్టీకాలు

సంసద్ భవంతుల కింద సమాధులు!
సెంట్రల్ విస్టానా? శవ పేటికనా?
అని పొరపాటున కూడా అడక్కండి
శవానికి కప్పే కఫన్ గుడ్డకు
జియ్యస్టీ కట్టాలని గుర్తొస్తే
సమాధి గొయ్యి బావురుమంటుంది!

జోక్ ఇన్ ఇండియా జమానాలో

ప్రభు వర్గానికి ప్రశ్నలై ఎదురెళ్లి
ప్రమాదాలనెవరూ కోరి తెచ్చుకోకండి
దేశమంతా వినమ్రంగా ఉండండి
భక్తి మందుకు ప్రజలంతా ఎడిక్ట్ కండి
పన్ను చెల్లింపుదారులంతా పవిత్ర
కర్తవ్యాన్ని శ్రమటోడ్చి నిర్వర్తించండి!

టు లెట్, ఫర్ సేల్ – కొత్త స్కీములతో

దానీ బానీ దారుల్లోకి మరలిపోయే
రాయితీ పద్దుల మీద డేగ కళ్ళేవీ
పడకుండా
కాషాయ మబ్బుల అడ్డుతెరలు కట్టండి
వాచ్ డాగ్‌లు ఏవీ మొరగకుండా
కుర్చీ కాళ్ళకు కట్టి తోకూపేలా వాటిని
మచ్చిక చెయ్యండి !

నిర్భీతి గొంతుతో స్వతంత్రించి
ఏ ఆడకూతురో జర్నలిజం ఉనికి
గుర్తుచేస్తే

ఆమె గొంతునొక్కే గోదీ శిష్యుల్ని
ఉదాసీనంగా చూస్తూ నేరస్తులవండి
ఏదో ఫైల్స్ పేరుతో వారు వడ్డించే
విద్వేష విషాన్ని ఓటిటిలో చూసి
ఒంటబట్టించుకోండి
చరిత్ర మనకేం నేర్పిందనే సంగతటుంచి
వారు మార్చే టాపిక్ ఏమార్పుల్లో
కుశాలగా కుదురుకోండి –

నూరు లక్షల కోట్ల అప్పా.. అని
నోళ్ళెళ్ళ బెట్టకండి

సోషల్ మీడియా విసర్జించే
ఒక్కో మారేడుకాయకు మరికొంత
మసిపూసి
ప్రచారంలో పెట్టి మురిసిపోండి
జై భారత్, జై ఇండియా సరే
జై హింద్ అంటూ గొంతు చించుకోండి
'మేరా భారత్ మహాన్' ఒక్క క్యాప్షన్
కింద మీ బిడ్డల భవిష్యత్తును
మీరే సమాధి చెయ్యండి
'మేరా భారత్ మహాన్' !

– కంచరాన భుజంగరావు,
94415 89602

మతోన్మాదంపై చేసిన యుద్ధం 'తురకవాడ' కవిత్వం

పుస్తకం



మతతత్వ రాజకీయాలను అర్థం చేసుకోవడానికి 90వ దశకం చాలా కీలకమైంది. అద్వానీ రథయాత్రపై అప్పటికే దేశం అట్టుడుకుతోంది. ఈ రథయాత్ర తర్వాత బాబ్రీ విధ్వంసానికి దారి తీస్తుందని మొదట పెద్దగా ఎవరూ ఊహించి ఉండరు. కానీ, తెలుగునాట ఖాదర్ మొయినుద్దీన్ అనే కవి ఊహించాడు. అద్భుతమైన 'పుట్టుమచ్చ' అనే కావ్యానికి ఊపిరి పోసి ఇప్పటికీ తెలుగునాట వాక్యాలై వినిపిస్తున్నాడు.

1992 సంఘటన తర్వాత వచ్చిన అత్యంత ప్రభావవంతమైన కవుల్లో అజీద్ ఒకడు. ఇతను తాజాగా వేసిన కవితల పుస్తకం 'తురకవాడ' ఆ విషయాన్ని ఇట్టే చెప్పేస్తుంది. 1992 నుంచి 1994 దాకా ఒక ఉద్వేగపు వర్షం వంటి కవిత్వాన్ని, కవి కరీముల్లా మాటల్లో చెప్పాలంటే కణకణలాడే ఫకీరు డప్పులాంటి కవిత్వాన్ని రాసిన ఇతను ఆ తర్వాత ఎందుకు ఆగిపోయాడో అర్థం కాదు.

జీవితంలో స్థిరపడ్డం కోసం ఒక చిన్నపాటి ఇల్లయినా కొనుక్కుని నిలదొక్కుకోవడం కోసం తర్వాత చాలాకాలం పాటు కవిత్వం జోలికి వెళ్లలేదని ఇదే పుస్తకంలో కవి చెప్పుకున్నప్పటికీ ఎందుకనో మనలాంటివాళ్లకు అతను అలా ఆగాల్సింది కాదు అనిపిస్తుంది. కవిత్వమో.. జీవితమో .. తేల్చుకోవాల్సిన పరిస్థితులు అప్పట్లో అతని ముందు ఉండటం కూడా కొంత బాధ కలిగిస్తుంది. ఏది ఏమైనా 94 వరకు రాసినవి, ఆ తర్వాత ఈ మధ్యకాలంలో రాసినవి ఒకటీ, రెండు కలిపి మొత్తం 30 నికార్సయిన కవితలతో వేసిన పుస్తకం 'తురకవాడ'.

2003లో నేను 'తురకోడి సేద్యం' అనే కథ రాస్తే అది తిట్టులా ఉందని దాన్ని 'రజాక్ మియా సేద్యం' అని పేరు మార్చి వేశారు ఓ పత్రికా సంపాదకులు. అప్పుడు అక్కడ తప్పిపోయిన తురకోడు అనే పదం ఇప్పుడు ఇక్కడ ఇలా కవితల పుస్తకానికి ఒక శీర్షికలా తలెత్తుకుని కనబడ్డం నాకు కొంత ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ పుస్తకం బహిరంగంగా పట్టుకుతిరగడం కొంత ఇబ్బంది కదా.. అని కూడా అనిపించింది. అంతలోనే కవి అజీద్ ధైర్యానికి ముచ్చట కలిగింది. సాధారణంగా కవితల పుస్తకాల జోలికి వెళ్లని నాకు ఈ పుస్తకం మీద నాలుగు ముక్కలు రాయాలని కోరికను రగిలించింది.

దేశంలో 1990 కాలంలో ఉన్న పరిస్థితులే ఇప్పటికీ ఏమాత్రం చెక్కుచెదరకుండా ఉన్నాయని 'తురకవాడ' కవిత్వం చదివితే అర్థమవుతుంది. ఉన్నట్టుండి ఊళ్లో ఉన్న నాలుగిళ్లు 'తురకవాడ'గా ఎందుకు మారాయో, సాయిబయ్యా.. బూబమ్మ అంటూ ఆప్యాయతలు ఒలకబోసిన నోళ్లిప్పుడు ఎందుకు కాషాయ కబుర్లాడుతున్నాయో కవి స్పష్టంగానే చెబుతాడు ఇందులో. 'ఐదేళ్లకొకసారి జరిగే పండుగే నా పల్లెలో చిచ్చు పెట్టింది' అంటాడు. ఊళ్లలోకి మత రాజకీయాలు వచ్చిన తర్వాత సప్త వర్ణాలన్నీ ఒకే రంగుగా మారాయని ఆవేదన చెందుతాడు. అభివృద్ధి, వెనుకబాటు, అక్షరాస్యత వంటి వాటి పేర్లు చెప్పకుండా కేవలం మైనార్టీకి వ్యతిరేకంగా మెజార్టీని రెచ్చగొట్టి అధికారంలోకి రావొచ్చని సులభమైన మార్గాన్ని కనుగొన్న పాలకుల మీద, వారి ఎత్తుగడలకు సులభంగానే ప్రభావితమవుతున్న ఈ దేశ అమాయక జనం మీద జాలి కలిగి అంతలోకే దు:ఖం కలుగుతుంది.

మైనార్టీలు సొంత గడ్డపైనే పరాయీకరణ చెందుతున్న వైనాన్ని 'అద్దె బతుకు' కవిత వివరిస్తుంది. 'మకిలితనం లేని మనుషులకు, ఎవత్తోనో రంకుతనం అంటగట్టి, సరిహద్దుల ఆవలిదాకా తరమాలనే తుఫాన్ హెచ్చరిక తీరం దాటింది. అభద్రతా భయం భూతమై దేహాన్ని పట్టి పీడిస్తుంది' అంటాడు కవి.

మొన్న కరోనా దగ్గర్నుంచి ఇప్పటి రైలు సంఘటన దాకా ప్రతి దానికీ మైనార్టీలకు ముడిపెట్టి మీడియా, పాలకులు ఎలా వారిని కార్నర్ చేస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారో ఈ కవిత గుర్తు చేస్తుంది. రేపు ఇంకెక్కడైనా ఏదైనా జరిగితే దానితో ఏ సంబంధమూ లేకపోయినా ఏదో మూల ఒక అమాయకుడు బిక్కుబిక్కుమంటూ బతికే పరిస్థితులు ఈ దేశంలో ఎందుకున్నాయో స్ఫురణకు వస్తుంది. అజీద్ ఈ కాలానికి ఉండాల్సిన కవి. ఇతనికి భూత, భవిష్యత్ వర్తమాన విషయాల మీద పూర్తి పట్టుంది. పదునైన వ్యక్తీకరణ ఉంది. పాత్రికేయుడుగా కూడా ఉండటం వల్లనేమో తనదైన భాష ఉంది. అధ్యయనంతో కూడిన కవిత్వం రాయడం ఇతని ప్రత్యేకత.

“ఎన్నో వేల ఏళ్లనాటి, చెదలు బెట్టిన విశ్వాసాలను పూజిస్తూ, మనువు వారసత్వాన్ని భుజాన మోస్తున్న వృద్ధులు, ఐదారు శతాబ్దాల ప్రాయపు బిడ్డ నుదుట చరిత్రను తిరగరాయడం అన్యాయమే కదా! మధ్య ప్రాచ్యం నుంచి వలస వచ్చిన ఆర్యులు, రాయీ రప్ప, చెట్టూ పుట్టను దేవుళ్లగా మార్చి, ఇక్కడే మహావృక్షాలుగా పాతుకు పోయినప్పుడు, మహమ్మదు పరాయివాడు ఎలా అయ్యాడు?” అంటాడు.

ఇలాంటి సూటి ప్రశ్నలు కవిత్వంలో తుపాకీలా పేలినప్పుడు మన గుండె కూడా అదిరిపడుతుంది. ఇలాంటి వాక్యాలు నేను ఈ మధ్య కాలంలో ఎక్కడా చదవలేదు. నిజానికి 90ల కాలంలో వచ్చినంత నిక్కచ్చయిన వాక్యం ఇప్పుడు లేదేమో అనిపిస్తుంది. విపరీతమైన నిర్బంధం, భావ ప్రకటన స్వేచ్ఛ మీద దాడి, ప్రగతికాములకు వ్యతిరేకంగా తయారవుతున్న ప్రగతి వ్యతిరేక సమూహం దీనంతటికీ కారణం కావొచ్చు.

చరిత్ర నిండా ఉన్న వెలుగుని వదిలేసి ఎక్కడ ఏదో మూల అంటిన చీకటిని చూపిస్తూ వర్తమానంలో మొత్తం ఒక సమూహాన్నే దోషులుగా చూపిస్తున్న వైనాన్ని కవి 'కాఫిర్' కవితలో ఎండగడతాడు. 'మూడు రంగుల జెండా సాక్షిగా చెబుతున్నాను, నేనిక్కడ పుట్టినందుకు గర్విస్తున్నాను, అక్బర్లు... జహంగీర్లు.. కత్తులకు వందల నిఖాలు చేసిన, నేర చరిత్రకు నాకెలాంటి సంబంధమూ లేదు' అంటాడు.

ఏ గొడుగూ కింద లేకుండానే స్వతంత్రంగా ఉంటూ అడుగడుగునా కవితా ఫిరంగులు పేల్చే ఈ పుస్తకం ప్రతి ఒక్కరూ చదవదగ్గది. పుస్తకంలో నచ్చేవి ఏ రెండు కవితలో అయితే వాటి అంగాంగ వర్ణన చేసేవాణ్ని. పుస్తకమే నచ్చినప్పుడు వర్ణించడం మాని చదవమని కోరడం ఒక్కటే వివేకమైన పని అని తెలిసిన వాణ్ని... ఇంతకు మించి ఏం చెప్పగలను!

('తురకవాడ', కవితా సంపుటి, రచయిత : అజీద్, ధర : 125, పేజీలు : 100, ప్రతులకు : 92462 13493)

– వేంపల్లె షరీఫ్

మనవద్ద గొప్ప కవిత్వం వస్తోంది!

సంభాషణ



ప్రముఖ తెలుగు కవి డాక్టర్ పెరుగు రామకృష్ణ ఇటీవల తన వర్ణలిపి కవితా సంపుటికిగానూ పనోరమా అంతర్జాతీయ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనతో సంభాషణ టూకీగా ....

పనోరమా అంతర్జాతీయ అవార్డు అందుకున్నాక మీ అనుభూతి ఏమిటి?

నా తాజా 9వ కవితా సంపుటి వర్ణలిపి ఇండో గ్రీస్ సంస్థ రైటర్స్ కాపిటల్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారి 2023 పనోరమా గోల్డన్ బుక్ అవార్డు పొందినందుకు గొప్ప ఆనందం కలిగింది. ప్రపంచంలోని వివిధ భాషల సరసన ఒక తెలుగు కవిత్వం కూడా విజేతగా నిలవడం, అవార్డు అందుకోవడం తెలుగు భాషకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. గ్రీకు, స్పానిష్, థాయ్, ఇంగ్లీషు లాంటి భాషల మధ్య తెలుగు కవిత గెలిచింది. గ్రీస్, కొలంబియా, స్పెయిన్, చిలీ, థాయిలాండ్, అమెరికా లాంటి దేశాల కవులతో కొందరు భారతీయ కవుల పుస్తకాలు ఈ అవార్డును అందుకున్నాయి.

మీ కవిత్వం ఆం.ప్ర ప్రభుత్వం పాఠ్య విషయంగా నిర్ణయించారు కదా! భావితరం విద్యార్థులకు వచన కవిత్వ పరిచయం, అవగాహన పాఠశాల స్థాయిలోనే జరిగిందని అనుకోవచ్చా?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ఏడాది విడుదల చేసిన 9 వతరగతి తెలుగు పరిమళం అనే పాఠ్యపుస్తకం లో నా వచన కవిత 52 లైన్లు పాఠ్య విషయంగా ఇవ్వడం నా సాహితీ జీవితంలో ఒక ప్రతిష్టాత్మక విజయంగా తలుస్తాను. ఇతర కవిమిత్రుల వచన కవితలు కూడా ఇందులో వుండటం విద్యార్థులకు ఈ ప్రక్రియ సమగ్రంగా పరిచయం చేసి సరైన అవగాహన కలిగిస్తాయి. ఇది శుభ పరిణామమే కదా? భవిష్యత్‌లో వారు ఈ ప్రక్రియ పట్ల ఆసక్తి కలిగి రచనలు కూడా చేయవచ్చు.

కవిగా మీ ధ్యేయం?

కవిత్వం హృదయభాషగా నమ్ముతాను. సమకాలీన భారత సమాజాన్ని సామాజిక స్పృహతో కవిత్వీకరణ చేసి భావితరాలకు అందించే ప్రయత్నం చేస్తుంటాను. మానవతా వాదమే సారాంశంగా నా కవిత్వ రచనలు సాగుతుంటాయి. అలతి అలతి పదాలలో అనల్ప భావాలు చెప్పడం నాకు ఇష్టం.

ఈనాటి తెలుగు కవిత్వం అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే ఎలా ఉండాలి?

ఈనాటి తెలుగు కవిత్వం ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తుంది. గొప్ప అభివ్యక్తి, వస్తు వైవిధ్యాలతో వెలువడి అలరిస్తూంది. మన చుట్టూ వున్న చిన్నఅంశాలను కూడా విశ్వజనీనం చేయడంలో తెలుగు కవి, భారతీయ కవి ముందు వరుసలోనే ఉన్నారు. మన ప్రాంతీయభాషల రచనలు విస్తతంగా ప్రపంచభాషల్లోకి అనువాద మయినపుడు మన రచనల గొప్పతనం ప్రపంచానికి మరింతగా తెలుస్తుంది. అప్పుడు ఇతర దేశాల సజనాత్మక సాహిత్యంతో తులనాత్మక అధ్యయనం చేసే వీలు కలుగుతుంది.

సంభాషణ : టేకుమళ్ల వెంకటప్పయ్య

ఎన్నికల కోసమే బిజెపి యుసిసి నాటకం

- ఎఐయుడిఎఫ్ విమర్శ



న్యూఢిల్లీ : ఎన్నికల్లో లబ్ధి పొందే దురుద్దేశంతోనే బిజెపి ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి) నాటకానికి తెర లేపిందని ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎఐయుడిఎఫ్) విమర్శించింది. ఏ అంశం లేకపోవడంతోనే త్వరలో జరిగే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికలకు ముందు కాషాయ పార్టీ యుసిసిని ముందుకు తెస్తోందని ఎఐయుడిఎఫ్ ప్రధాన కార్యదర్శి అమినుల్ ఇస్లాం అన్నారు. బిజెపి ముస్లింలను టార్గెట్ చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ పార్టీ యుసిసికి వ్యతిరేకమని స్పష్టం చేశారు. కూరగాయల ధరల పెరుగుదలపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కులం, మతం ఆధారంగా బిజెపి ప్రజలను విభజిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈశాన్య ప్రాంతంలో అనుకూల పరిస్థితి లేకపోవడంతో ప్రజల మధ్య అంతరం సృష్టించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని విమర్శించారు. కూరగాయల ధరల పెరుగుదలకు మియా ముస్లింలే కారణమని హిమంత బిశ్వ శర్మ అనడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు.

రాజకీయాలు చర్చించలేదు !

- శరద్ పవార్‌ను కలిసిన అజిత్ పవార్

ముంబయి: మహారాష్ట్రలోని ఎన్‌సిపిలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల ఎన్‌సిపి నుంచి తిరుగుబాటు చేసిన అజిత్ పవార్ గ్రూపు నేతలు ఆదివారం ముంబయిలో ఆ పార్టీ అధినేత శరద్ పవార్‌ను కలిశారు. ఆయన్ను కలిసిన వారిలో మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్‌తో పాటు ప్రఫుల్ పటేల్, ఛగన్ భుజ్‌బల్, దిలీప్ పాటిల్ తదితరులు ఉన్నారు. తిరుగుబాటు చేసిన తర్వాత తొలిసారి వీరంతా ఆయన్ను కలవడం గమనార్హం. ఈ సందర్భంగా ప్రఫుల్ పటేల్ మాట్లాడుతూ.. శరద్‌పవార్ ఆశీస్సుల కోసమే వచ్చినట్టు తెలిపారు. ఎన్‌సిపిని ఐక్యంగా ఉంచాలని శరద్‌ను కోరినట్టు పేర్కొన్నారు. తమ విజ్ఞప్తిపై ఆయనేమీ స్పందించలేదని తెలిపారు.

నాటో విస్తరణతో ప్రపంచ శాంతి, సుస్థిరతకు ముప్పు

- మలేషియా విశ్లేషకులు

కౌలాలంపూర్ : ప్రచ్ఛన్న యుద్ధం తరువాత జరిగిన నాటో విస్తరణతో ప్రపంచ శాంతి, సుస్థిరత ప్రమాదంలో పడ్డాయని మలేషియాకు చెందిన ప్రముఖ రాజకీయ విశ్లేషకులు లీపీ మే విమర్శించారు. యూరప్ భాగస్వాములతో ఏర్పడిన నాటో ఇప్పుడు పూర్తిగా అమెరికా చేతిలోకి వెళ్లిపోయిందని, ఏకపక్షంగా వ్యవహరిస్తుందని ఇంటర్నేషనల్ ఇస్లామిక్ యూనివర్శిటీలో పనిచేసే లీ లీ మే తెలిపారు. నాటో తన సభ్యులందరి ప్రయోజనం కోసం కాకుండా.. కేవలం అమెరికా ప్రయోజనాల రక్షణ కోసమే ఎలా రూపాంతరం చెందిందో అందరం చూస్తూనే ఉన్నామని అన్నారు. నాటో ఇప్పుడూ ఆసియాలోకి కూడా చొచ్చుకుపోయిందని, చైనాకు వ్యతిరేకంగా అమెరికా తన ప్రయత్నాలకు నాటోను ఉపయోగించుకుంటుందని విమర్శించారు. అయితే చైనాను ప్రత్యర్థిగా చూపాలనే నాటో ప్రయత్నాలకు ఎదురుదెబ్బ తగలిందని అన్నారు.

మసీదులోకి ముస్లింలు వెళ్లకుండా ఆంక్షలు

- నమాజ్ కూడా చేయకూడదట!
- జలగావ్ కలెక్టర్ అసాధారణ ఆదేశం
- హైకోర్టును ఆశ్రయించిన మసీదు ట్రస్ట్, వక్ఫ్ బోర్డు
- పిటిషన్లపై రేపు విచారణ



ముంబయి : అది ఉత్తర మహారాష్ట్రలోని 800 సంవత్సరాల నాటి పురాతన జుమ్మా మసీదు. ముంబయి నుంచి 350 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. జలగావ్ జిల్లాలోని ఎరండల్ తాలూకాకు చెందిన ముస్లింలు ప్రతి రోజూ ఆ మసీదుకు వచ్చి ఐదుసార్లు ప్రార్థనలు చేస్తారు. అయితే ఇప్పుడు ఆ కార్యక్రమం ఆగిపోయింది. మసీదులో ప్రార్థనలు చేయరాదంటూ జిల్లా కలెక్టర్ అమన్ మిట్టల్ జారీ చేసిన తాత్కాలిక ఆదేశాలే దీనికి కారణం. మసీదు ప్రాంగణంలోకి కూడా వెళ్లరాదని ఆంక్షలు విధించారు. కరడుకట్టిన మితవాద హిందూ సంస్థ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ కలెక్టర్ ఈ ఆకస్మిక నిర్ణయం తీసుకున్నారు. మసీదు ప్రాంగణంలో ప్రార్థనలు చేయకుండా అక్కడ 144వ సెక్షన్ కూడా విధించి, పోలీసులను మోహరించారు. మసీదును స్వాధీనం చేసుకోవాలని తహసిల్దార్‌ను ఆదేశించారు. ఈ మసీదు 'వివాదం'లో ఉన్నదని సాకు చూపారు. కాగా కలెక్టర్ ఆదేశాలను జుమా మసీదు ట్రస్ట్ సభ్యుడు అస్లాం బాంబే హైకోర్ట్ ఔరంగాబాద్ బెంచ్‌లో సవాలు చేశారు. కలెక్టర్ ఇచ్చిన అసాధారణ ఆదేశాలు మతపరమైన విద్వేషాలకు కారణమవుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 18న దీనిపై హైకోర్టులో విచారణ జరగనుంది.

వివాదం ఎందుకు?

శతాబ్దాల కాలం నాటి మసీదు ఒక్కసారిగా వివాద స్థలం ఎందుకైంది? ఊరూ పేరూ లేని పాండవ్‌వాడ సంఘర్ష్ సమితి అనే మితవాద సంస్థ ఇచ్చిన ఫిర్యాదే దీనికి కారణం. ఈ సంస్థకు చెందిన ప్రసాద్ మధుసూదన్ దండవతే అనే వ్యక్తి మే లో జలగావ్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు. ఆయన ఆర్‌ఎస్‌ఎస్, విహెచ్‌పి, బజరంగ్‌దళ్ సంస్థల్లో కూడా సభ్యుడే. అజ్ఞాతవాసంలో పాండవులు ఇక్కడ బస చేశారని, ఆ ప్రాంతంలో మందిరం కూడా ఉండేదని, దానిని కూల్చి మసీదును నిర్మించారన్నది ఆయన ఆరోపణ. దానిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జుమా మసీదు ట్రస్ట్ చట్టవిరుద్ధంగా ఆ స్థలాన్ని ఆక్రమించిందని కూడా దండవతే ఆరోపించారు.

మసీదు ట్రస్ట్, వక్ఫ్ ఏమన్నాయి?

అయితే ఈ విషయంలో ఏమీ తమకు తెలియదని మసీదు ట్రస్ట్ తెలిపింది. కలెక్టర్ కూడా విచారణ జరిపారని, అయితే తమ వాదనలు వినిపించేందుకు తగినంత సమయం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ నెల 11న కలెక్టర్ నిషేధ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పింది. ట్రస్ట్ కమిటీకే కాకుండా వక్ఫ్ బోర్డుకు, భారత పురావస్తు శాఖకు (ఎఎస్ఐ) కూడా కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. ఇది పురాతన కట్టడమేనన్న ట్రస్ట్ వాదనను ఎఎస్ఐ కూడా సమర్థించింది. ముస్లింలు ప్రార్థనలు చేసేందుకు మసీదులో తగినంత స్థలం ఉన్నదని ఎఎస్ఐ చెబుతోంది. మరోవైపు ఫిర్యాదుపై విచారణ జరిపే అధికారం కలెక్టర్‌కు లేదని వక్ఫ్ బోర్డ్ తేల్చి చెప్పింది. వివాదాలపై పరిశీలన జరిపే అధికారం వక్ఫ్ బోర్డుకు తప్ప ఎవరికీ ఉండదని కలెక్టర్‌కు రాసిన లేఖలో బోర్డ్ సీఈఓ స్పష్టం చేశారు. వక్ఫ్ ట్రిబ్యునల్ పరిధిలో ఉన్న అంశంపై కలెక్టర్ ఎలా ఉత్తర్వులు ఇస్తారని ప్రశ్నించారు.

హైకోర్టుకు పక్షాలు

కలెక్టర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మసీదు ట్రస్ట్ హైకోర్టును ఆశ్రయించింది. స్వాతంత్ర్యం ముందు నుంచీ తన వద్ద ఉన్న పత్రాలను సమర్పించింది. వివిధ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను కూడా కోర్టు దృష్టికి తెచ్చింది. 1960వ దశకం తర్వాత కూడా పత్రాల నవీకరణ జరిగింది. మసీదును పురాతన కట్టడంగా ఆ పత్రాలు ధృవీకరించాయి. తమ వాదనలు వినేందుకు కలెక్టర్ సుముఖత చూపలేదని ట్రస్ట్ తెలిపింది. తమ వాదనను పట్టించుకునే స్థితిలో కూడా కలెక్టర్ లేరని, తమకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ఈ నెల 11న ఆయన ఆదేశాలు జారీ చేశారని వివరించింది. ఈ వివాదానికి సంబంధించి దాఖలైన పిటిషన్లపై బొంబాయి హైకోర్టుకు చెందిన ఔరంగాబాద్ బెంచ్ ఈ నెల 18న విచారణ చేపట్టనుంది. కోర్టు ఆదేశాలను అనుసరించి సంబంధిత భాగస్వామ్య పక్షాలతో సమావేశం నిర్వహించి వివాద పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అమన్ మిట్టల్ తెలిపారు. 'ప్రస్తుతం ఇచ్చిన ఉత్తర్వులు తాత్కాలికమైనవే. అంతిమ ఆదేశాలు కాదు. ఈ నెల 13న జరిగిన చర్చల్లో భాగస్వామ్య పక్షాలు హాజరై తమ వాదన వినిపించారు. తదుపరి విచారణ 18న జరగనుంది' అని మిట్టల్ తెలిపారు.

యుపిలో యూనిఫాం కష్టాలు

- యోగి సర్కారు తీరుపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కష్టాలు తప్పటం లేదు. యూనిఫాం, పుస్తకాలు వారికి అందలేదు. గత మూడు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు యూనిఫాం లేకుండానే తరగతులకు హాజరవుతుండటం గమనార్హం. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ప్రాథమిక పాఠశాలలకు కొత్త అకడమిక్ సెషన్ ఏప్రిల్ 1న ప్రారంభమైంది. అయినప్పటికీ, యోగి సర్కారు ప్రాథమిక పాఠశాలలు (1 నుండి 5 తరగతులు), ప్రాథమికోన్నత పాఠశాలల్లోని విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాలకు డబ్బును బదిలీ చేయడంలో విఫలమైందని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల జాతీయ స్థాయి సంస్థ రాష్ట్రీయ షేక్శిక్ మహాసంఘ్ (ఆర్‌ఎస్‌ఎం) జాతీయ ప్రతినిధి వీరేంద్ర మిశ్రా తెలిపారు. ఇదిలా ఉంటే మొదటి టర్మ్ పరీక్షలు ఇంకా నెలరోజులు మాత్రమే ఉండటం గమనార్హం. 2021లో షర్టులు, ప్యాంటు (రెండు సెట్లు), స్వెటర్లు, షడలు, సాక్స్‌లు, స్కూల్ బ్యాగ్‌తో సహా యూనిఫాంల కొనుగోలు కోసం విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలకు రూ.1,200 జమ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే నేటికీ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఈ బదిలీ కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలోని లఖింపూర్, బహ్రైచ్, సీతాపూర్, బల్లియా, అజంగఢ్‌లతో సహా అనేక పాఠశాలలకు కొత్త సెట్‌ల పుస్తకాలు చేరలేదు. యుపిలోని 1.58 లక్షల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సుమారు 1.87 కోట్ల మంది విద్యార్థులు చదువుతున్నారు.

ఇంటర్నెట్ లేక 73 రోజులు

- 20 వరకు నిషేధం పొడిగించిన మణిపూర్ ప్రభుత్వం
- పలు సంస్థలు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలకు ఇక్కట్లు

ఇంఫాల్ : జాతి హింసతో అల్లర్లు చెలరేగిన ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో గత 73 రోజులుగా ఇంటర్నెట్ లేదు. అక్కడి బీజేపీ ప్రభుత్వం ఇంటర్నెట్ బ్యాన్‌ను విధించింది. అయితే ఈ నిషేధాన్ని అక్కడి సర్కారు మరో ఐదు రోజులు పొడిగించింది. దీంతో ఇంటర్నెట్ బ్యాన్ రాష్ట్రంలో ఈనెల 20 వరకు కొనసాగనున్నది. హింసాత్మక ఘటనలు, దాడులు, ఇండ్లకు నిప్పు పెడుతున్న ఘటనలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని రాష్ట్ర డీజీపీ సమర్పించిన నివేదికలో వెల్లడైందని ఈనెల 15న జారీ చేసిన నోటిఫికేషన్‌లో రాష్ట్ర హోం శాఖ కమిషనర్ టి. రంజిత్ సింగ్ వివరించారు. ఇంటర్నెట్ లేకపోవటంతో అక్కడి సంస్థలతో పాటు ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాష్ట్రంలో ఇంటర్నెట్ సదుపాయాన్ని పునరుద్ధరించాలని అనేక సంస్థలు, ప్రజలు మణిపూర్ హైకోర్టుతో పాటు దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించారు.

హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం

కొన్ని ప్రాంతాల్లో పరిమిత ఇంటర్నెట్‌కు అనుమతినిస్తూ గత నెల 16న మణిపూర్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే, దాదాపు నెల తర్వాత ఈనెల 7న ఇంటర్నెట్ కనెక్షన్లపై నిషేధాన్ని ఎత్తివేయాలంటూ మరోసారి రాష్ట్ర ప్రభుత్వాన్ని మణిపూర్ హైకోర్టు ఆదేశించింది. అయితే, హైకోర్టు ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. పిటిషన్ విచారణకు భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డి.వై చంద్రచూడ్, న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్. నరసింహ లతో కూడిన ధర్మాసనం అంగీకరించింది. నేడు (సోమవారం) ఈ పిటిషన్‌ను న్యాయస్థానం విచారించనున్నది.

వర్షాకాల సమావేశాలలో 21 బిల్లులు

న్యూఢిల్లీ : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో నరేంద్ర మోడీ ప్రభుత్వం 21 బిల్లులను ప్రవేశపెట్టబోతోంది. ఈ సమావేశాలు ఈ నెల 20న ప్రారంభమై ఆగస్ట్ 11వ తేదీ వరకూ కొనసాగుతాయి. లోక్‌సభలో ఇప్పటికే ప్రవేశపెట్టిన బిల్లుల పైన, వివిధ బిల్లులపై పార్లమెంటరీ కమిటీలు అందజేసిన నివేదికల పైన కూడా చర్చ జరుగుతుంది. జీవ వైవిధ్య సవరణ బిల్లు, జనవిశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు, వివిధ రాష్ట్రాల సహకార సొసైటీల (సవరణ) బిల్లు, అటవీ (సంరక్షణ) సవరణ బిల్లు, మధ్యవర్తిత్వ బిల్లును వివిధ పార్లమెంటరీ కమిటీలు ఇప్పటికే పరిశీలించి నివేదికలు అందించాయి. ఇవి సభ ఆమోదం పొందాల్సి ఉంది. కాగా దేశ రాజధానిలో సేవలపై నియంత్రణ విషయంలో జారీ చేసిన వివాదాస్పద ఢిల్లీ ఆర్డినెన్స్ స్థానంలో ప్రభుత్వం బిల్లును ప్రవేశపెడుతుంది. దీనిపై పార్లమెంటులో వాడివేడి చర్చ జరిగే అవకాశం ఉంది. ఈ ఆర్డినెన్స్‌పై తక్షణమే మధ్యంతర స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించిన విషయం తెలిసిందే. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వంపై లెఫ్టినెంట్ గవర్నర్‌కు పెత్తనం కట్టబెట్టేందుకు ఉద్దేశించిన ఈ ఆర్డినెన్స్‌ను ఆమ్‌ఆద్మీ పార్టీతో పాటు వివిధ ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. రాజ్యసభలో ఎన్డీఏ ప్రభుత్వానికి తగిన మెజారిటీ లేకపోవడంతో పెద్దల సభలో దీనిని ఎలాగైనా అడ్డుకునేందుకు ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రయత్నిస్తోంది. ఈ బిల్లుపై నిన్నటి వరకూ స్పష్టమైన వైఖరి ప్రకటించని కాంగ్రెస్ పార్టీ తాజాగా ఆదివారం నాడు ఢిల్లీ ఆర్డినెన్సుకు మద్దతు ఇవ్వబోమని స్పష్టం చేసింది. రాజధానిలో ప్రభుత్వ అధికారుల బదిలీలు, నియామకాల విషయంలో తీసుకొచ్చిన ఈ ఆర్డినెన్సును సమర్థించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. డేటా ప్రొటెక్షన్ బిల్లును కూడా ఈ సమావేశాలలోనే ప్రవేశపెట్టాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించింది. హిండెన్‌బర్గ్ నివేదికలో అదానీ గ్రూప్‌పై చేసిన ఆరోపణలపై చర్చించాలని, ఈ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో దర్యాప్తు జరిపించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఇందుకు మోడీ ప్రభుత్వం సుతరామూ ఇష్టపడడం లేదు. ఈ నేపథ్యంలో అదానీ గ్రూపు వ్యవహారం మరోసారి పార్లమెంటును కుదిపేసే అవకాశం ఉంది. కాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు పడిన తర్వాత పార్లమెంట్ సమావేశాలు జరగడం ఇదే మొదటిసారి. అంతేకాక నూతన పార్లమెంట్ భవనంలో తొలిసారి సమావేశాలు జరుగుతున్నాయి. పాత భవనంలో సమావేశాలను ప్రారంభించి, ఆ తర్వాత నూతన భవనంలోకి మారుస్తారని తెలుస్తోంది.

ఆర్‌టిఐ చట్టం పరిధిని కుదిస్తుంది

- డేటా ప్రొటెక్షన్ బిల్లుపై ఎంపీలకు ఎన్‌సిపిఆర్‌ఐ లేఖ

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టే డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు సమాచార హక్కు చట్టం పరిధిని కుదిస్తుందని, కేంద్రానికి విశేష విచక్షణాధికారాలు కట్టబెడుతుందని నేషనల్ క్యాంపెయిన్ ఫర్ పీపుల్స్ రైట్ టూ ఇన్ఫర్మేషన్ (ఎన్‌సిపిఆర్‌ఐ) అనే సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. బిల్లును అడ్డుకోవాలంటూ పార్లమెంట్ సభ్యులకు లేఖలు రాసింది. ఈ బిల్లు ద్వారా ప్రజలు తమ వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుకునే హక్కును కోల్పోతారని ఎన్‌సిపిఆర్‌ఐ తెలిపింది. 'ఆర్‌టీఐ చట్టానికి ప్రతిపాదించిన సవరణల ప్రకారం ప్రజలు విధిగా తమ వ్యక్తిగత సమాచారాన్ని కూడా బహిర్గతం చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత చట్టంలో ఇందుకు కొన్ని మినహాయింపులు ఉన్నాయి. నూతన బిల్లులో వాటిని తొలగించారు. సున్నితమైన వ్యక్తిగత సమాచారం వెల్లడికి ఈ బిల్లు పరిమితం కావడం లేదు. దీనివల్ల ఎన్నో సమస్యలు వస్తాయి. ఆర్‌టీఐ చట్టాన్ని సరిగా అర్థం చేసుకోకుండా ఈ బిల్లును ప్రతిపాదించారు' అని వివరించారు.

పాముకాటు కేసులపై ఐసిఎంఆర్ అప్రమత్తం

న్యూఢిల్లీ : భారత్‌లో పాము కాటు కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) అప్రమత్తమవుతున్నది. పాము కాటు కేసులపై అవగాహన కల్పించేందుకు సిద్ధమవుతున్నది. పాము కాటు కేసులు భారత్‌లో సంవత్సరానికి సగటున 58 వేల మరణాలకు కారణమవుతున్నది. దేశంలో రుతుపవనాల రాకతో పాము కాటు కేసుల సంఖ్య పెరుగుతుందని ఐసీఎంఆర్ అంచనా వేస్తున్నది. ఈ విషయంలో వైద్యాధికారులు, ప్రజలతో పాటు ఆరోగ్య కేంద్రాల కోసం హిందీ, ఇంగ్లీష్, ఒడియా భాషలలో విద్యా సామాగ్రిని ఐసీఎంఆర్ విడుదల చేయబోతున్నది. ఆరోగ్య కార్యకర్తలకు సంబంధించిన విద్యా విషయాలు ఇతర ప్రాంతీయ భాషలలో, ముఖ్యంగా పాము కాటు కేసులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలలో ప్రచురించబడతాయి. ఆశా (గుర్తింపు పొందిన సామాజిక ఆరోగ్య కార్యకర్తలు) కార్మికులు, సహాయక నర్స్ మిడ్‌వైవ్‌లు (ఏఎన్‌ఎం), ఇతర ఆరోగ్య కార్యకర్తలకు పాము కాటును ముందుగానే గుర్తించడం, సమర్థవంతమైన ప్రథమ చికిత్స అందించడం, సమీప ఆరోగ్య సంరక్షణకు సకాలంలో రిఫరల్‌లు అందించడం వంటి వాటిపై చర్యలు తీసుకోనున్నది. ఐసీఎంఆర్ బుక్‌లెట్‌లో సాధారణంగా కనిపించే పాము జాతులు, పాము కాటు విషం యొక్క సంకేతాలు, లక్షణాల చిత్రమైన వర్ణనలు ఉన్నాయి. ఇది ప్రథమ చికిత్స, నివారణ చర్యలను కూడా వివరిస్తుంది.

దిగ్విజయంగా కాశ్మీర్ యాపిల్ రైతుల తొలి రాష్ట్ర మహాసభ

- షోపియాన్‌లో రెండు రోజుల పాటు నిర్వహణ



షోపియాన్‌లో నిర్వహించిన సభకు పెద్దసంఖ్యలో తరలివచ్చిన యాపిల్ రైతులు, అభివాదం చేస్తున్న తరిగామి

శ్రీనగర్ : యాపిల్ రైతుల సమస్యలపై జాతీయస్థాయి ఉద్యమాలను నిర్మించడంలో కీలక పాత్ర పోషిస్తున్న యాపిల్ ఫార్మర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన జమ్ముకాశ్మీర్ విభాగం (జెఅండ్‌కె ఎఎఫ్ఎఫ్ఐ) మొట్టమొదటి రాష్ట్ర మహాసభ దిగ్విజయంగా జరిగింది. షోపియాన్‌లో శని, ఆదివారాల్లో నిర్వహించిన ఈ మహాసభకు జమ్ము ప్రాంతం నుంచి, కాశ్మీర్ లోయ నుంచి పెద్ద సంఖ్యలో యాపిల్ రైతులు హాజరయ్యారు. ఈ సమావేశానికి రెండు ప్రత్యేకతలు ఉన్నాయి. ఇందులో మొదటిది జమ్ముకాశ్మీర్ ప్రాంతానికి చెందిన యాపిల్ రైతులు ఈ విధంగా సమావేశమవ్వడం ఇదే మొదటిసారి.

అలాగే కల్లోల ప్రాంతంగా గుర్తింపు పొందిన షోపియాన్ జిల్లాలో మహాసభ జరగడం రెండో ప్రత్యేకత. మహాసభకు 165 మంది ప్రతినిధులు హాజరయ్యారు. అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ఆర్థిక కార్యదర్శి పి కృష్ణప్రసాద్, గుప్కార్ కూటమి అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే మహ్మద్ యూసఫ్ తరిగామి మహాసభకు హాజరై సంఘీభావం తెలిపారు. తగ్గుతున్న ధరలు, ప్రభుత్వ మద్దతు లేకపోవడం వంటివి యాపిల్ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే అంశాలపై నివేదికను జహూర్ అహ్మద్ రాథర్ సమర్పించారు. అలాగే 14 డిమాండ్లను కూడా ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

అధ్యక్షకార్యదర్శులుగా జహూర్, రషీద్

మహాసభ 11 సభ్యులతో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. జహూర్ అహ్మద్‌ను అధ్యక్షులుగానూ, అబ్దుల్ రషీద్‌ను కార్యదర్శిగానూ ఎన్నుకున్నారు. ఎఐకెఎస్ అధ్యక్షులు అశోక్ ధవే ప్రసంగంతో తొలి రోజు సమావేశం ముగిసింది. రెండో రోజున ఈ నెల 16న షోపియాన్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించారు. ఆకస్మిక భారీ వర్షాలను, భద్రతా సమస్యలను దాటుకుంటూ భారీ సంఖ్యలో యాపిల్ రైతులు ఈ సమావేశానికి హాజరయ్యారు. అశోక్ ధవాలే, పి కృష్ణప్రసాద్, జహూర్ అహ్మద్, గులాం నబీ మాలిక్, అద్దుల్ రషీద్ పండిట్, ఓం ప్రకాశ్ ప్రసంగించారు. మహాసభ ముగింపు సందర్భంగా నిర్వహించిన సభలో తరిగామి ప్రసంగించారు. యాపిల్ రైతుల పోరాటాలకు గుప్కార్ కూటమి అండగా నిలుస్తుందని తెలిపారు.

తుపాకీ లైసెన్సులలో యుపి, జమ్మూకాశ్మీర్ టాప్

- ఆర్టీఐ సమాచారంలో వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో తుపాకీ లైసెన్సులు ఉత్తరప్రదేశ్, కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూకాశ్మీర్‌లలో అధికంగా ఉన్నాయి. లైసెన్స్ పొందిన తుపాకీ హోల్డర్ల విషయంలో యుపి మొదటి స్థానంలో నిలవగా, జమ్మూకాశ్మీర్ రెండో స్థానంలో ఉన్నది. దేశంలో జారీ అయిన తుపాకీ లైసెన్స్‌ల సంఖ్యలో కూడా ఇవి ముందుండటం గమనార్హం. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద ఈ విషయం వెల్లడైంది. పంజాబ్ మూడో స్థానంలో ఉన్నది. 2016 నుంచి 2023 మధ్య కాలంలో అత్యధిక సంఖ్యలో తుపాకీ లైసెన్స్‌లను జారీ చేసిన 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో .. జమ్మూ కాశ్మీర్, పంజాబ్, యుపి, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, మహారాష్ట్ర, మణిపూర్, నాగాలాండ్‌లు ఉన్నాయి. 2016లో యూపీ, జమ్మూ కాశ్మీర్, పంజాబ్, మధ్యప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, కర్నాటక, మహారాష్ట్ర, బీహార్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలు అత్యధిక సంఖ్యలో తుపాకీ లైసెన్సులను కలిగి ఉన్నాయి.

జమ్మూకాశ్మీర్‌లో తుపాకీ లైసెన్స్‌ల జారీపై 2018లో నిషేధం విధించగా.. 2023లో దీన్ని ఎత్తివేశారు. రాజస్థాన్ పోలీసుల యాంటీ టెర్రర్ స్క్వాడ్ (ఏటీఎస్) జరిపిన దర్యాప్తులో గన్ లైసెన్స్ రాకెట్ వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో నిషేధం విధించబడింది. అయినప్పటికీ 2016 నుంచి 2023 మధ్య కాలంలో జారీ చేసిన తుపాకీ లైసెన్స్‌ల సంఖ్య 1,30,914తో దేశంలోనే అగ్రగామిగా ఉండటం గమనార్హం. ముఖ్యంగా నిషేధం అమలులో ఉన్నందున, లైసెన్సులు 2016 నుంచి 2018 మధ్య, తర్వాత ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు మాత్రమే జారీ చేయబడ్డాయి. ప్రస్తుతం జమ్మూకాశ్మీర్‌లో తుపాకీ లైసెన్సు హోల్డర్ల సంఖ్య 5,00,105గా ఉన్నది. ఈ ఏడాది జూన్ 20 నాటికి దేశవ్యాప్తంగా 37.7 లక్షల యాక్టివ్ తుపాకీ లైసెన్స్‌లు ఉన్నాయని తేలింది. దేశంలో అత్యధిక సంఖ్యలో తుపాకీ లైసెన్సులు ఉన్న ఏకైక కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూ కాశ్మీర్ కాగా, లక్షద్వీప్‌లో జీరో లైసెన్స్‌లు ఉన్నాయి. జమ్మూ కాశ్మీర్ తర్వాతి స్థానంలో (ఈ ఏడాదికి సంబంధించి) చండీగఢ్, ఢిల్లీ, లఢఖ్, అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి, డామన్ డయ్యూ, దాద్రానగర్ హవేలీ లు ఉన్నాయి.

యుపిలో ప్రస్తుతం 1,329,584 మంది లైసెన్స్‌దారులు ఉన్నారు. అంతకముందు ఈ సంఖ్య 1,277,914గా ఉన్నది. దీనిలో పెరుగుదల 51,670 కావటం గమనార్హం. యూపీలో యోగి హయాంలో, ఉ 51,670 లైసెన్సులు జారీ చేయబడ్డాయి. యూపీలో లైసెన్సుల జారీని 2018 వరకు నిషేధించారు. రాష్ట్రంలో రాష్ట్ర పోలీసు బలగాలు కలిగి ఉన్న ఆయుధాల సంఖ్య కంటే వ్యక్తులకు జారీ చేయబడిన ఆయుధాల లైసెన్సుల సంఖ్య ఐదు రెట్లు ఎక్కువ అని కోర్టు ఒక సందర్భంలో వెల్లడైంది.

ఆసుపత్రి నుంచి కొలంబియా చిన్నారుల డిశ్చార్జి




బొగోటా : విమాన ప్రమాదం బారీన పడి అమెజాన్ అడవుల్లో సుమారు ఐదు వారాలు ఒంటరిగా గడిపిన నలుగురు కొలంబియా చిన్నారులు ఇటీవలే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. అమెజాన్ అడవుల నుంచి వీరిని రక్షించిన తరువాత బొగోటా మిలటరీ ఆసుపత్రులో చికిత్స అందించారు.

34 రోజుల పాటు ఆసుపత్రిలో ఉన్న తరువాత వీరిని ఈ నెల 14న డిశ్చార్జి చేశారు. మే 1 జరిగిన విమాన ప్రమాదంలో చిన్నారులు తమ తల్లిని, ఇద్దరు ఇతర పెద్దవాళ్లను కోల్పోయారు. 40 రోజుల పాటు వీరు ఒంటరిగా గడపడం ప్రపంచ వ్యాప్తంగా పతాక శీర్షికలకెక్కింది. వీరిలో పెద్ద అమ్మాయి (లెస్లీ, 13 ఏళ్లు) ధైర్యంగా ఉండటం, అమెకు అడవులపై మంచి అవగాహన ఉండటం ఇందుకు కారణంగా అధికారులు చెబుతున్నారు.

ఇది యుద్ధ నేరమే!

- ఉక్రెయిన్‌కు అమెరికా క్లస్టర్ బాంబుల సరఫరాపై పుతిన్



మాస్కో: ఉక్రెయిన్‌కు అమెరికా క్లస్టర్ బాంబులను సరఫరా చేయడం యుద్ధ నేరమేనని రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ అన్నారు. ఇందుకు ప్రతీకారం తీర్చుకునే హక్కు రష్యాకు ఉంటుందని హెచ్చరించారు. ఆదివారం ఆయన జర్నలిస్టు జరుబిన్‌తో మాట్లాడుతూ, క్లస్టర్ బాంబులు ఎంతో మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్నాయి. ఇప్పటికీ బలిగొంటున్నాయి. అందువల్లే ఈ ఆయుధాల వినియోగాన్ని, సరఫరాను నిషేధిస్తూ తెచ్చిన ఒడంబడికను వందకుపైగా దేశాలు ఆమోదించాయి. అమెరికా ఇప్పుడు వీటిని ఉక్రెయిన్‌కు అందించడాన్ని యుద్ధ నేరంగానే పరిగణిస్తున్నామని ఆయన అన్నారు. మా దగ్గర కూడా క్లస్టర్ ఆయుధాలు ఉన్నాయి. ఇప్పటివరకు మేము వాటిని వినియోగించలేదు. ఉక్రెయిన్ గనుక ఈ ఆయుధాలను ప్రయోగిస్తే అందుకు ప్రతీకారం తప్పదని పుతిన్ హెచ్చరించారు.

అమెరికా తనను తాను దిగజార్చుకుంటోంది: ఎలాన్ మస్క్

విస్తృతంగా నిషేధించిన క్లస్టర్ బాంబులను ఉక్రెయిన్‌కు సరఫరా చేయడం ద్వారా అమెరికా తనను తాను దిగజార్చుకుంటోందని టెస్లా, స్పేస్ ఎక్స్ సిఇవో ఎలాన్ మస్క్ పేర్కొన్నారు. ఆయన ట్విట్టర్‌లో ట్వీట్ చేస్తూ, 'ఉక్రెయిన్‌కు పంపడానికి మా దగ్గర మందుగుండు సామగ్రి అయిపోయింది. కాబట్టి నిరాశతో క్లస్టర్ బాంబులను వారికి పంపుతున్నాము' అని అమెరికా ఈ చర్య ద్వారా తెలిపినట్లైందని అన్నారు. క్లస్టర్ ఆయుధాల సరఫరా చేయాలన్న బైడెన్ ప్రభుత్వ నిర్ణయాన్నిఅమెరికన్ కాంగ్రెస్‌లోని 98 మంది రిపబ్లికన్లు, 49 మంది డెమొక్రాట్లు వ్యతిరేకించడాన్ని మస్క్ ప్రశంసించారు. అయినా, ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోవడం అమెరికాకే అవమానం అని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికా చర్యను బ్రిటన్, జర్మనీతో సహా దాని మిత్రదేశాలు తీవ్రంగా వ్యతిరేకించాయి.

అమిత్ షా ఓఎస్‌డినంటూ..

న్యూఢిల్లీ : పీఎంఓ సీనియర్ అధికారిగా తనను తాను పరిచయం చేసుకొని పోలీసులకు చిక్కిన నకిలీ అధికారి కిరణ్ పటేల్ ఘటన మరవకముందే అలాంటి ఘటననే చోటు చేసుకున్నది. అయితే, ఈ సారి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా డిపార్ట్‌మెంట్‌లో చోటు చేసుకున్నది. అమిత్ షా ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డి)నంటూ యుపికి చెందిన ఒక సివిల్ ఇంజినీర్ నకిలీ అధికారి అవతారమెత్తాడు. అయితే, పోలీసులు అతని ఆటకట్టించారు. అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. పీఎంఓ సీనియర్ అధికారినంటూ నమ్మించిన మోసగాడు కిరణ్ పటేల్ గతేడాది అరెస్టయిన విషయం తెలిసిందే.అమిత్ షా ఓఎస్డీ నంటూ నమ్మించిన నిందితుడు రాబిన్ ఉపాధ్యాయ్(48)ను యూపీలోని మీరట్‌వాసిగా గుర్తించారు. నిందితుడు గత 25 ఏండ్లుగా పలు బహుళజాతి కంపెనీలలో వృత్తిరీత్యా పని చేసినట్టు అధికారులు తెలిపారు. గంగా ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టుకు ఉపాధ్యక్షుడు, ప్రాజెక్టు కోఆర్డినేటర్ పదవిపై ఉపాధ్యాయ్ దృష్టి సారించారు.

న్యాయ వ్యవస్థకు తూట్లు పొడిచే బిల్లుపై

28వ వారానికి చేరిన నిరసనలు



జెరూసలెం: న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు బిల్లు తీసుకొస్తున్న ఇజ్రాయిల్‌లోని పచ్చి మితవాద నెతన్యాహు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు రోజురోజుకీ ఉధృతమవుతున్నాయి. వరుసగా 28వ వారం కూడా వేలాది మంది టెల్ అవీవ్ వీధుల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. నెతన్యాహు మరో వైపు అనారోగ్యంతో శనివారం ఆసుపత్రి పాలయ్యాడు. నెతన్యాహు ప్రభుత్వం ఈ బిల్లులో కీలక భాగానికి సంబంధం ప్రాథమిక ఆమోదం పొందింది. ఈ నెల చివరి నాటికి దీనిని చట్టంగా తీసుకురావాలని ప్రభుత్వం పావులు కదుపుతోంది. అయితే అంత తేలిక కాకపోవచ్చు. ఈ బిల్లు చట్టంగా మారడానికి మరో రెండు దశల్లో ఓటింగ్ అవసరమవుతుంది. దీనికి అదే స్థాయిలో ప్రతిఘటన కూడా పెరుగుతోంది. శనివారం టెల్ అవీవ్‌లో పది వేల మంది నిరసనకారులు న్యాయవ్యవస్థను కాపాడాలంటూ ప్రదర్శన నిర్వహించారు. 'ఎస్ఓఎస్' అని రాసి ఉన్న ప్లకార్డులను పట్టుకుని, గులాబీ, కాషాయ రంగు పౌడర్‌ను గాలిలోకి విసురుతూ నిరసన తెలిపారు. జెరూసలెంలోని నెతన్యాహు నివాసం ఎదుట కాగడాలతో నిరసన తెలిపారు. ఇజ్రాయిల్‌లోని ప్రధాన పట్టణాలన్నీ శనివారం నిరసనలతో హోరెత్తాయి. బహుళ ప్రాచుర్యం పొందిన టివి సిరీస్‌లోని పాత్రలను పోలిన రెడ్ రోబ్స్ వేష ధారణలో మహిళలు పెద్ద సంఖ్యలో ఈ నిరసన ర్యాలీలో పాల్గొనడం విశేషం. ఈ బిల్లు గనుక చట్టంగా మారితే తమ హక్కులన్నీ ప్రభుత్వం లాగేసుకుంటుందన్న ఆందోళన మహిళల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఈ బిల్లును ఉపసంహరించుకుంటే సరే, లేక పోతే దేశవ్యాపిత సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని, మొత్తం ఆర్థిక వ్యవస్థే స్తంభించిపోయేలా చేస్తామని జాతీయ కార్మిక సంఘ నాయకుడు ఆర్నాన్ బార్ డేవిడ్ హెచ్చరించారు. న్యాయ వ్యవస్థను దెబ్బ తీసే ఆలోచనను విరమించుకోవాలని మిలిటరీ అధికారులు, యుద్ధ విమాన పైలెట్లు, వ్యాపారవేత్తలు నెతన్యాహును కోరారు. ఈ ఏడాది జనవరిలో నెతన్యాహు ప్రధానిగా తిరిగి పగ్గాలు చేపట్టిన వెంటనే న్యాయవ్యవస్థపై దాడి మొదలెట్టాడు. దీనికి వ్యతిరేకంగా ఇజ్రాయిల్ అంతటా పెద్దయెత్తున నిరసన జ్వాలలు చెలరేగాయి.నెతన్యాహు ఇప్పటికే పలు అవినీతి కుంభ కోణాల కేసుల్లో ఇరుక్కున్నాడు. పలు అక్రమాలకు పాల్పడినట్లు అభియోగాలు ఉన్నాయి. ఈ కేసుల్లో శిక్ష పడకుండా తప్పించుకోడానికే న్యాయ వ్యవస్థ స్వతంత్రతను దెబ్బ తీసేందుకు ఆయన యత్నిస్తున్నాడని పరిశీలకులు పేర్కొన్నారు.



మీకోసం

బెండకాయ కూర చేయడానికి ముందు కట్ చేసిన ముక్కల మీద కాస్త నిమ్మరసం చల్లితే జిగురు ఉండదు.

జీవన సౌరభం

ఒక్క నిమిషంలో జీవితం ఏమీ మారదు. కానీ ఆ ఒక్క నిమిషం ఆలోచించి తీసుకున్న నిర్ణయం మాత్రం జీవితాన్ని మార్చేస్తుంది.

ప్రగతి జెండా

అదిగదిగో మన ప్రగతి జాడ
మువ్వన్నెల జెండా
రెపరెపలాడుతూ ఎగిరింది
భారత జాతి గర్వపడంగా
త్యాగధనుల త్యాగనిరతికి తరగని చిహ్నమై
మహనీయుల మమతల
మహిమాన్విత రూపమై
దివ్య యశస్సుల ప్రచండ దీపమై
నవ ఉషస్సుల ప్రబోధ రాగమై
// అదిగదిగో//
సస్య శ్యామలమై
ప్రేమామృత శాంతి ధామమై
నాగరికతలకు ఆద్యమై
మానవాళి మనుగడకే విశ్వమాతయై
విశేష సంస్కృతుల అశేష ఖ్యాతియై
ఇలా తలాన భారతీయ
సౌరభాలు విరజిమ్ముతూ
// అదిగదిగో//
పర్వత పంక్తులు, జీవనదులు ప్రణమిల్లగా
హిమ శైలాలు వింజామరలు వీచగా



వింధ్య సంధ్యావందనంతో స్వాగతించగా
అవనిలో విశిష్ట సంపద గనియై
భారత ఆశా కిరణమై విశ్వ ప్రకాశినియై
// అదిగదిగో//

భావ శ్రీ
8106586997.



గుడ్లగూబ
చిలుక
పిచుక
పావురం
బాతు
కాకి


జత చేయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు.. వాటికి ఎదురుగా కొన్ని పదాలు ఇచ్చాం. బొమ్మకు సరైన పదం జత చేయండి..

నేను గీసిన బొమ్మ



కె.పూర్ణ సంస్కృతి,
6వ తరగతి,
శ్రీచైతన్య టెక్నో స్కూల్,
మందస.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మహిళలకు ఉపాధి, రక్షణే ధ్యేయంగా ...

వృత్తిరీత్యా ఆమె ఆర్కిటెక్.. మోటారు బైక్ నడపడం అభిరుచి. ఆమె పేరు జై భారతి. హైద్రాబాద్‌లో నివసించే భారతి చాలామంది బైక్ రైడర్స్ లాగానే బైక్‌పై వివిధ దేశాలు చుట్టేశారు. అలా ఓసారి థాయ్‌లాండ్‌కి వెళ్లిన ఆమెకు అక్కడ రోడ్ల మీద ట్యాక్సీలు నడుపుతూ, బైక్ రైడింగ్ చేస్తూ చాలామంది మహిళలు కనిపించారు. వారంతా సొంత వాహనాలు నడిపేవారు కాదు.. బతుకుతెరువు కోసం డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. మరి మనదేశంలో ఈ రంగంలో మహిళలు ఎందుకు లేరు అని ఆమె ప్రశ్న వేసుకున్నారు. ఉండి తీరాలీ అని నిర్ణయించుకున్నారు.

భారతి ఇండియా తిరిగి వచ్చాక- మొబిలిటీ రంగంలో మహిళల ఉపాధే ధ్యేయంగా 2019లో 'ఎంఒడబ్ల్యుఒ' (మూవింగ్ ఉమెన్) (కదిలే మహిళ) పేరుతో, 2022 నుండి 'ఎంఒడబ్ల్యుఒ ఫ్లీట్' పేరుతో సంస్థలను ప్రారంభించారు. 'ఎంఒడబ్ల్యుఒ' భారతదేశంలో మహిళల కోసం ప్రారంభించిన మొట్టమొదటి మోటారు శిక్షణా సౌకర్యాన్ని అమలుచేసే సాంకేతిక భాగస్వామిగా కూడా ఉంది. ఈ ప్రయాణంలో ఆమె అనుభవాలు ఆమె మాటల్లో విందాం.

ఓసారి నేను ఇండియా నుంచి వియత్నాం బైక్ రైడింగ్ చేస్తున్నాను. 17 వేల కిలోమీటర్ల ఆ ప్రయాణంలో రోడ్డు రవాణా మార్గంలో ఎందరో మహిళలు ఉపాధి మార్గంలో ఉండడం గమనించాను. వియత్నాం, థాయ్‌ల్యాండ్, కాంబోడియా దేశాల్లో 40 ఏళ్లకు పైబడిన మహిళలు కాల్ ట్యాక్సీలు, బైకులు నడుపుతూ కనిపించారు. రోడ్లపైకి మహిళలు అంత స్వేచ్ఛగా వస్తున్నారంటే వారికి అక్కడ భద్రత ఉందని నాకర్థమైంది. మన దేశంలో లింగ వివక్ష ఎక్కువగా ఉంది. పురుషులతో సమానంగా మహిళలు మోటారు రంగంలో లేరు. ఇక్కడ కూడా అలాంటి పరిస్థితులు రావాలి. రవాణా రంగంలో పురుషులతో సమానంగా మహిళలకు కూడా ఉపాధి ఉండాలి. ముఖ్యంగా రోడ్డు మార్గంలో మహిళలు జీవనోపాధి సంపాదిస్తే క్రమేణా అది మహిళందరి రక్షణకు దోహదపడుతుందని నేను నమ్ముతాను. ఆ ఆలోచన నుండే ఎంఒడబ్ల్యుఒ ఆవిర్భవించింది.

ఉపాధే లక్ష్యంగా ఎంఒడబ్ల్యుఒ ఫ్లీట్..

నేను శిక్షణ ప్రారంభించిన కొంతకాలానికే నాకు ఒక విషయం అర్థమైంది. మొబిలిటీ రంగం వైపు వెళ్లాలని మహిళలు ఆసక్తి చూపుతున్నా సామాజికంగా, సాంస్కృతికంగా వారు సమస్యలు ఎదుర్కొంటున్నారు. పైగా దీన్ని గౌరవప్రదమైన ఉపాధిగా పరిగణించకపోవడం వల్ల అనేక అవమానాలు పడాల్సివస్తోంది. దీంతో శిక్షణకే పరిమితం చేయకుండా జీవనోపాధి పొందేలా 'ఎంఒడబ్ల్యుఒ' ఫ్లీట్‌ను ప్రారంభించాను. ఇందులో మెరుగైన ఉపాధి మార్గాలను ప్రవేశపెట్టాను.

ఇప్పటికీ తక్కువ ఆదాయం గల కుటుంబాల మహిళలకు డ్రైవింగ్ నైపుణ్యం ఉండటం లేదు. ఎందుకంటే ఇది సాంప్రదాయానికి విరుద్ధమని భావిస్తారు. ఆ మహిళలను ఇటువైపు రప్పించడం నాకు ఎదురైన మొదటి సవాల్. రెండో సవాల్ ఏంటంటే.. చాలామంది మహిళలకు ఈ ఉద్యోగాలు చేయగలమా లేదా అని వెనకడుగు వేసేవారు. వారందరిలో ఆత్మవిశ్వాసం పెంపొందేలా పలు వర్క్‌షాపులు నిర్వహించాను.

సౌకర్యవంత పని వేళల్లోనే..

ఈ రంగంలో మహిళలు రాణించాలంటే వాళ్లు ఎదుర్కొనే మరో సమస్య.. రాత్రి పూట డ్రైవింగ్ చేయడం.. సాధారణంగా అటువంటి సమయంలో ఎక్కువ మొత్తం చెల్లించేందుకు కస్టమర్లు ఆసక్తి చూపిస్తారు. కానీ మహిళలు ఆ ప్రయాణాలు సురక్షితం కాదని భావించి కూడా వెనకడుగు వేస్తున్నారు. వారి సౌలభ్యం కోసం సౌకర్యవంతమైన వేళల్లో.. పరిమిత గంటల్లో ఆదాయం తగ్గకుండా ఈ రంగంలో ఉపాధి పొందే మార్గాల గురించి అన్వేషించాను. ఆసక్తి ఉన్న కొంతమంది మహిళలను కూడా సంస్థలో భాగం చేసుకున్నాను. వారంతా ఎంఒడబ్ల్యుఒలో శిక్షణ తీసుకున్న వారే.





గౌరవప్రద ఉపాధిగా..

మా దగ్గర శిక్షణ తీసుకున్న వారిలో చాలా మంది మహిళా డ్రైవర్లు ఉపాధిమార్గంలో ఉన్నారు. వారిని చూసి మరింత మంది మహిళలు ఈ రంగంవైపు కచ్చితంగా వస్తారు. ఇతర రంగాల వైపు వెళ్లాలని చూసే మహిళలు డ్రైవింగ్ నైపుణ్యం మంచి అవకాశంగా భావించాలి. నేను అనుకున్న లక్ష్యం నెరవేరడంలో ఈ మహిళా డ్రైవర్లు టార్చ్ బేరర్లుగా ఉండబోతున్నారు. ఇది నాకు చాలా సంతోషంగా ఉంది.

నా ప్రయాణం వ్యవస్థను మారుస్తోంది..

రెండు చక్రాలను బ్యాలెన్స్ చేసుకుంటూ ప్రపంచాన్ని చుట్టి వస్తున్న నేను ఎంతో ఆత్మవిశ్వాసం ఉంటేనే ముందుకు అడుగేయగలను. అదే ధైర్యం ఈ మహిళల్లోనూ చూడాలనుకున్నాను. ఓ సమస్య నన్ను పరిష్కారం వైపు నడిపించింది. ఆ ప్రయాణం ఓ వ్యవస్థను తయారుచేస్తోంది. సానుకూల దృక్పథంతో అనుకున్న లక్ష్యం వైపు అడుగులు వేస్తే విజయం తప్పకుండా కలుగుతుంది. మార్పు మొదలవ్వాలంటే మొదటి అడుగు మీదే కావాలి'.

బైక్ రైడింగ్ ప్రారంభించిన జై భారతి దక్షిణాసియా నుండి యుఎస్ వరకు లక్ష కిలోమీటర్ల దూరం ప్రయాణించారు. ఎంఒడబ్ల్యుఒ ఫ్లీట్ ద్వారా మహిళా సాధికారత సాధించేందుకు దేశవ్యాప్తంగా పలు వర్క్‌షాపులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ రంగంతో అనుసంధానమై ఉపాధి కల్పిస్తున్నారు. ఓ వాట్సాప్ నంబరు క్రియేట్ చేసి అందులో 2000 మందిని సభ్యులుగా చేర్చారు. అక్కడ వారి ఆలోచనలు, ఆకాంక్షలు పంచుకుంటారు. సంస్థ తరపున ఇప్పటి వరకు హైద్రాబాద్‌లో 2500 మందికి శిక్షణ ఇచ్చారు. వారిలో 200 మంది ఎలక్ట్రిక్ ఆటోలు నడుపుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నారు. వీరంతా భవిష్యత్తులో కాల్ ట్యాక్సీలు నడుపుతామని ధైర్యంగా చెబుతున్నారు. ఫ్లీట్ ద్వారా పరిమిత కాలంలో రూ.15000 నుండి రూ.17 వేల వరకు ఆదాయం పొందుతున్న ఈ మహిళలంతా మొదటిసారి ఉపాధిమార్గంలోకి వచ్చినవారే.

వీలైనంత ఎక్కువమంది మహిళలు రవాణా రంగంలో జీవనోపాధి సంపాదిస్తే.. మహిళలు ధైర్యంగా వీరి వాహనాల్లో ప్రయాణిస్తారు. ఆ మార్పు క్రమంగా మహిళల రక్షణ వైపు అడుగులు వేస్తుంది.



హాలీవుడ్‌కు 'ఆర్టిఫిషియల్' సెగలు

ప్రపంచీకరణ, యాంత్రీకరణతో ఇప్పటికే అన్ని రంగాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. రోబోటిక్ యంత్రం వందమంది చేసే పని చేస్తుండటంతో నానాటికీ ఉపాధి అవకాశాలు మృగ్యమయ్యే ప్రమాద ఘంటికలు కన్పిస్తున్నాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), మెషిన్ లెర్నింగ్‌లు ఇప్పుడు విశ్వవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్నాయి. ఈ క్రమంలో వాటి ప్రభావానికి గురై ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులు పోరుబాట పడుతున్నారు. తాజాగా ఇదే కోవలోకి హాలీవుడ్‌కు చెందిన సినిమా నటీనటులు, రచయితలు చేరారు. హాలీవుడ్‌లో ఎఐ హీరోలు, యాంకర్లు, న్యూస్‌రీడర్లు వచ్చిన నేపథ్యంలో ఎఐ వల్ల చిత్ర పరిశ్రమలోనూ పెనుమార్పు సంభవించే అవకాశం ఉందని అక్కడి కళాకారులు వాపోతున్నారు. అయితే ఏఐ వినియోగాన్ని తగ్గించాలన్న కళాకారుల డిమాండ్‌ను నిర్మాణ సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. అలాగే నటీనటుల వేతనాలు పెంపునకు కూడా నిర్మాతలు సుముఖత వ్యక్తంచేయటంలేదు. ఈ నేపథ్యంలో నటీనటులు కూడా తమ డిమాండ్లను ఆమోదించే వరకూ సమ్మె కొనసాగించి తీరతామని స్పష్టంచేస్తున్నారు. చేసే పనికి గుర్తింపుతోపాటుగా గుర్తింపు, వేతనం, భద్రత కల్పించాలని కోరుతున్నారు.

విద్య, వైద్యం, ఆరోగ్యం, తయారీ రంగాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమమేథ) కుదిపేస్తోంది. తాజాగా ఎఐ దెబ్బకు హాలీవుడే అదిరి పడుతోంది. ఏఐ ఎఫెక్ట్ అన్ని తరగతులపై పడుతుండడంతో ఇండస్ట్రీలోని ప్రతీ క్రాఫ్ట్ సమ్మెకు మద్దతు పలకడంతో షూటింగ్‌లకు బ్రేక్ పడింది. ఎన్నడూ లేనంతగా హాలివుడ్‌కు ఎఐ రూపంలో ముప్పు పొంచి రావడంతో నటీనటులంతా కదం తొక్కారు. ఏఐతో పొంచి ఉన్న ప్రమాదంతో పాటు తమ భవిష్యత్‌కు భద్రత కల్పించేలా చూడాలంటూ ది స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్ సమ్మెకు దిగింది. దీంతో హాలీవుడ్‌లో సినిమాలు, వెబ్‌సిరీస్‌లు ఆగిపోయాయి. వేల కోట్ల బిజినెస్ జరిగే హాలీవుడ్‌లో.. ఏఐ పెట్టిన చిచ్చు మహా మహా నటులనే రోడ్డుపైకి వచ్చేలా చేసింది. సమ్మెకు ఏంజెలినా జోలీ, మెరిల్ స్ట్రీప్, ట్రామ్ క్రూజ్ వంటి హాలీవుడ్ దిగ్గజ స్టార్లు కూడా మద్దతు ఇస్తున్నారు. నిర్మాణ స్టూడియోలతో జరిగిన చర్చలు ఫలప్రదం కాకపోవడంతో నిరవధిక సమ్మెకు దిగారు. గురువారం అర్ధరాత్రి నుంచి జరుగుతున్న ఈ సమ్మెలో లక్షా 60 వేల మంది పాల్గొంటున్నారు.





63 ఏళ్ల తరువాత ...

1960లో హాలీవుడ్‌లో మొదటిసారి సమ్మె జరిగింది. తర్వాత 1980లో స్క్రీన్ యాక్టర్లు నిరసన తెలిపారు. మళ్లీ ఇన్నేళ్లకు రైటర్స్ గిల్డ్, స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్ కలిసి సమ్మెకు పిలుపునివ్వడంతో 98 శాతం మంది సమ్మెకు మద్దతు పలికారు. దీంతో సినిమాతో పాటు వెబ్‌సిరీస్, టీవీ సీరియళ్లు ఆలస్యం కానున్నాయి. సమ్మె ఇలాగే కంటిన్యూ అయితే మూవీ రిలీజ్‌లు కూడా వాయిదా పడే అవకాశాలున్నాయి. ఇప్పటికే విడుదల కావాల్సిన సినిమాల ప్రమోషన్లకు కూడా నటీనటులు దూరంగా ఉన్నారు. ఈ సమ్మె హాలీవుడ్ చరిత్రలోనే ప్రత్యేకంగా నిలిచిపోతుంది. ఇప్పుడు కనుక తాము గళం విప్పకపోతే.. కష్టాల్లో పడకతప్పదని గిల్డ్ ప్రెసిడెంట్ ఫ్రాన్ డ్రెషర్ అన్నారు. అత్యాశకు పోతున్న ఎఐ స్టూడియోల వల్ల తాము బాధితులమవుతున్నామని వాపోయారు.



అంగరంగ వైభవంగా లాల్ దర్వాజా బోనాలు

- వేలాదిగా తరలివచ్చిన సందర్శకులు
- సందర్శకులపై పోలీసుల లాఠీఛార్జి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

చారిత్రాత్మకమైన లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి దేవాలయంలో బోనాల జాతర ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి క్యూలైన్లలో వేచి ఉన్నారు. అమ్మవారికి ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, భక్తులు తమ మొక్కులు చెల్లించుకుని బోనాలు సమర్పించుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం తరుపున అమ్మవారికి దేవాదాయ శాఖ మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ పట్టువస్త్రాలు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి బంగారు బోనం సమర్పించారు. ఉమ్మడి దేవాలయాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలోని దాదాపు 460 దేవాలయాలు బోనాల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాయి. సందర్శకులకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖుల్లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్. ఎమ్మెల్సీ వాణిదేవి, ఎమ్మెల్యే దానం నాగేందర్, భారత మాజీ క్రికెటర్ మిథాలీ రాజ్, హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు. క్యాసినోలు నిర్వహిస్తూ గతంలో పోలీసులకు చిక్కిన చీకోటి ప్రవీణ్‌కుమార్... లాల్‌దర్వాజ అమ్మవారిని దర్శించుకునే క్రమంలో భద్రతా సిబ్బంది గన్‌తో ఆలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బోనాల ఉత్సవాల్లో నృత్యం చేసుకుంటూ ఒక్కసారిగా బోనాలతో ఆలయానికి వచ్చిన సందర్శకులను అదుపు చేసే పేరుతో వారిపై పోలీసులు లాఠీఛార్జి చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, వారికి మధ్య తోపులాట జరిగింది. కొందరికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో, పోలీసుల వ్యవహార శైలిపై సందర్శకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.




లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి దేవాలయానికి బోనాలతో వచ్చిన భక్తులు



దులీప్ ట్రోఫీ విజేత సౌత్‌జోన్

- ఫైనల్లో వెస్ట్‌జోన్‌పై 75పరుగుల తేడాతో గెలుపు
- 14వ సారి టైటిల్ కైవసం

బెంగళూరు: దులీప్ ట్రోఫీ టైటిల్‌ను సౌత్‌జోన్ జట్టు చేజిక్కించుకుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఫైనల్లో వెస్ట్‌జోన్‌పై 75 పరుగుల తేడాతో గెలిచింది. సౌత్‌జోన్ నిర్దేశించిన 298 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోర్ 5వికెట్ల నష్టానికి 182పరుగులతో ఆదివారం చివరిరోజు ఆటను కొనసాగించిన వెస్ట్‌జోన్ జట్టు చివరిరోజు 222 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ప్రియాంక్ పంచల్(95) పోరాడినా జట్టును గెలిపించలేకపోయాడు. ఓవర్‌నైట్ స్కోర్‌కు మరో మూడు పరుగులు జతచేసి ఔటయ్యాడు. అయితే.. అతిత్ షేత్, ధర్మేంద్ర జడేజా చివర్లో పోరాడినా ప్రయోజనం లేకపోయింది. జడేజా భారీ షాట్ ఆడి బౌండరీ వద్ద వాషింగ్టన్ సుందర్ చేతికి చిక్కాడు. దాంతో, ఆ జట్టు ఇన్నింగ్స్ ముగిసేందుకు ఎంతో సమయం పట్టలేదు. వి. కౌశిక్, సాయికిషోర్‌కు నాలుగేసి వికెట్లు దక్కాయి. దాంతో, గత ఏడాది ఫైనల్లో వెస్ట్ జట్టు చేతిలో ఓటమికి బదులు తీర్చుకున్నట్లయ్యింది. దీంతో సౌత్‌జోన్‌జట్టు ట్రోఫీ నెగ్గడం ఇది పద్నాలుగో సారి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ విద్వత్ కవిరప్పకు లభించాయి.



అల్కరాజ్ అదరహో..

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ కైవసం
ఉత్కంఠ పోరులో జకోవిచ్‌పై గెలుపు

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను టాప్‌సీడ్, స్పెయిన్‌కు చెందిన 20ఏళ్ల కార్లోస్ అల్కరాజ్ కైవసం చేసుకున్నా డు. ఆదివారం జరిగిన హోరాహోరీ ఫైనల్లో అల్కరాజ్ 1-6, 7-6(8-6), 6-1, 3-6, 6-4తో 2వ సీడ్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్‌పై విజయం సాధించాడు. దీంతో తొలిసారి వింబుల్డన్, కెరీర్‌లో 2వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ ఓటమితో 24వ గ్రాండ్‌స్లామ్‌తో పాటు 8వ వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ చేజిక్కించుకోవాలన్న జకోవిచ్ ఆశలు అడియాశలయ్యాయి. అల్కరాజ్ రూ.25కోట్లు, జకోవిచ్‌కు రూ.12.50కోట్లు ప్రైజ్ మనీ దక్కింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68